

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV — STRUGGLE FOR JUSTICE


సామాన్యుడి ఆయుధంగా





సంపుటి - 06 | సంచిక 133 | ఎడిటర్ : బరిగెల శివ | గురువారం 10, ఏప్రిల్ 2025 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్

అణిచివేతను ప్రదర్శిస్తున్న రాజకీయ నాయకులు

సామాన్యుల పాలిట శాపంగా మారుతున్న పలుకుబడిదారుల దాడులు

పాస్టర్ అజయ్ బాబు జీవితాన్ని నాశనం చేయడానికి ప్రయత్నం చేసిన సీఐ

పాస్టర్ హత్య కేసులో సాగుతున్న విచారణ సామాన్యుల మీదనా!...

అంతకుల మీదనా !

కుటుంబ సభ్యులను విచారిస్తే కేసు కొలిక్కి వస్తుందా !

కేసు ఆధారాలన్నీ దగ్గర పెట్టుకొని సంబంధం లేనోళ్లను విచారణ చేస్తున్నారు

నరహంతకులు ఆవేశంలో చంపమని ఒప్పుకుంటే వదిలేస్తారా !

క్రైస్తవాన్ని ఎంత అణిచివేయాలని చూస్తే అంత అభివృద్ధి చెందుతుంది.

ప్రభుత్వాలు అణిచివేత పరాకాష్ట స్థాయికి చేరాయి.

మత విద్వేషాలను రెచ్చగొట్టడం మానవ సంస్కారమమా.! : డాక్టర్ బరిగెల శివ

# ఆదర్శ సమాజంలో.. ఆదరణ కరువు!



డాక్టర్ బరిగెల శివ


జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్




**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

తెలుగు రాష్ట్రాలను భయాందోళనలకు గురిచేసిన పాస్టర్ ప్రవీణ్ పగడాల హత్య కేసుకు సంబంధించిన విచారణ హంతకులపై జరగాల్సింది పోయి కుటుంబ సభ్యులు, సామాన్యుల మీద జరుగుతుండడం దేనికి సూచనో విచారణ అధికారులు స్పష్టం చేయాలని డాక్టర్ బరిగెల శివ డిమాండ్ చేశారు. ప్రపంచమంతా హత్యాని మొత్తు కుంటుంటే విచారణ అధికారులు రోజుకో కొత్త రకమైన సమస్య తలెత్తబడే విధంగా మతోన్మాదులు ఆగడాలకు అవకాశాలు కల్పిస్తున్నట్లుగా విచారణ సాగుతూ ఉండడం కేసును నీరుగారుస్తున్నట్లుగా ఉందన్నారు. పోలీస్ అధికారులరా తాగుబోతు వీడియోలు ఎక్కడినుండి వచ్చాయో ఎందుకు పసిగట్ట లేకపోతున్నారన్నారు. ప్రభుత్వేతర నాయకులు ప్రశ్నిస్తుంటే విచారణ అధికారులు బెదిరింపులకు గురిచేయడం ,మానసికంగా దాడులు చేయడం ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వంలో ఉన్న నాయకులు నేరుగా ప్రజలను విచారణ అధికారులను ప్రభుత్వ నాయకులను తప్పుదోవ


- మిగతా 2లో..

## కీలక వడ్డీరేట్లను సవరించిన ఆర్‌బిఐ

వరుసగా రెండోసారి రెపోరేటు

0.25 శాతం మేర తగ్గింపు

తగ్గనున్న గృహ, వాహన రుణాల వడ్డీల భారం

ద్రవ్యపరపతి కమిటీ నిర్ణయాలు ప్రకటించిన

గవర్నర్ మల్హోత్రా

బంగారం రుణాలపై ఆంక్షలు విధించే యోచనలో ఆర్‌బిఐ


5




## మేధా పాట్కర్ జైలు శిక్ష సడలింపు

పరువునష్టం కేసులో శిక్ష అనుభవిస్తున్న సామాజిక కార్యకర్త మేధా పాట్కర్ కు ఢిల్లీ హైకోర్టు సత్ ప్రవర్తనకు గానూ ఆమె జైలు శిక్షను తగ్గించి, విడుదల చేసింది. ప్రస్తుతం ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ గా ఉన్న వికె సక్సేనా గుజరాత్ లో ఒక స్వచ్ఛంద సంస్థకు నాయకత్వం వహించినప్పుడు దాఖలు చేసిన పరువునష్టం కేసులో మేదా పాట్కర్ ఐదు నెలల జైలు శిక్షఎదుర్కొంటున్నారు. కాగా , మంగళవారం నాడు ఆమెను ఢిల్లీకోర్టు విడుదలకు ఆదేశాలు జారీ చేసింది. అయితే పాట్కర్ లక్షరూపాయల జరిమానా చెల్లించాలనే ముందస్తు షరతు విధించింది.మేధా పాట్కర్ మహిళ, 70 ఏళ్ల వృద్ధురాలు. ఆమెపై గతంలో ఎలాంటి నేరారోపణలు లేవు. ఆమెకు ప్రొబేషన్ పై విడుదల చేయకుండా నిరాకరించడానికి ఎలాంటి కారణాలు లేవని కోర్టు పేర్కొంది. అందువల్ల 2024 జూలై 1న మేధా పాట్కర్ కు కోర్టు విధించిన 5 నెలల సాధారణ జైలు శిక్షను మెజిస్ట్రీరియల్ కోర్టు సవరించి ఆదేశాలు జారీ చేసింది.



## పాలస్తీనియన్లకు తాత్కాలిక ఆశ్రయం కల్పిస్తాం

జకార్తా: గాజాలో ఇజ్రాయిల్ సైన్యం, హమాస్ కు మధ్య జరుగుతున్న యుద్ధంలో బాధితులైన పాలస్తీనియన్లకు తాత్కాలిక ఆశ్రయం కల్పించడానికి సిద్ధంగా ఉన్నామని ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో బుధవారం ప్రకటించారు. ఐక్యరాజ్యసమితి ప్రకారం గత నెలలో ఇజ్రాయిల్ గాజాపై తిరిగి దాడులను ప్రారంభించినప్పటి నుండి దాదాపు 4,00,000 మంది గాజా నివాసితులు నిరాశ్రయులయ్యారు. గాయపడిన బాధితులకు ఆశ్రయం కల్పించడానికి సిద్ధంగా ఉన్నామని ప్రబోవో తెలిపారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, టర్కీ, ఈజిప్ట్, ఖతార్ మరియు జోర్డాన్‌లకు, మధ్యప్రాచ్య పర్యటనకు బయలుదేరే ముందు ఆయన ఈ ప్రకటన చేశారు. “వారిని రవాణా చేయడానికి మేము విమానాలను పంపడానికి సిద్ధంగా ఉన్నాము. మొదటి దశలో 1,000మంది ఉండవచ్చని మేము అంచనా వేస్తున్నాము. గాయపడిన పాలస్తీనియన్లు, అనాథలైన పిల్లలకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని” ఆయన అన్నారు. బాధితులు కోలుకునే వరకు, వారు తిరిగి సురక్షితంగా వెళ్లేవరకు మాత్రమే ఇండోనేషియాలో ఉంటారని, దానికి సంబంధించిన వివరాలను పాలస్తీనా అధికారులతో, స్థానిక పార్టీలతో చర్చించాలని విదేశాంగ మంత్రిని ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన ముస్లిం దేశమైన ఇండోనేషియా, ఇజ్రాయిల్-పాలస్తీనా వివాదానికి పరిష్కరించుకోవాలని రెండు దేశాలకు నిరంతరం పిలుపునిస్తుంది.

## మంచు కుటుంబంలో ముదురుతున్న వివాదం

జల్‌పల్లి నివాసం ముందు మనోజ్ బైఠాయింపు

ఉద్రిక్తతలు చోటు చేసుకోకుండా పోలీసుల మొహరింపు

ఆస్తి పంచాయితీ కాదంటున్న మంచు మనోజ్


5


## వృద్ధిరేటులో అట్టడుగున తెలంగాణ

**కాంగ్రెస్ నిర్వాకంపై మండిపడ్డ కెటిఆర్**

**హైదరాబాద్,ఏప్రిల్9(జై భీమ్ న్యూస్):**

జీఎస్డీపీ, తలసరి వృద్ధి రేటులో తెలంగాణ అట్టడుగున నిలవడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ వేసిన ఆర్థిక పునాదులను కాంగ్రెస్ సర్కార్ ధ్వంసం చేస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. జీఎస్టీ వృద్ధిరేటు గుండు సున్నాగా నమోదు కావడంతో ఆయన ధ్వజమెత్తారు. సన్నాసి ఢిల్లీ పార్టీలను నమ్మితే.. తెలంగాణ బతుకు సున్నా అని మరోసారి రుజువుచేసిన సందర్భమిది అని కేటీఆర్ పేర్కొన్నారు. తెలివి లేని దద్దమ్మను గద్దెనెక్కిస్తారు.. కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రాన్ని ఆగం చేస్తారు.. కోట్లాది మంది జీవితాలతో చెలగాటమాడతారు అని కాంగ్రెస్ పార్టీపై నిప్పులు చెరిగారు. ఆర్థిక వృద్ధిలో అగ్రభాగాన ఉన్న రాష్ట్రాన్ని పాతాళానికి పడేసిన ఈ పాపం క్షమించరానిది. టూరిస్టు పార్టీలను నమ్మితే జరిగే విధ్వంసమిది.. విజన్ లేనోళ్ల చేతిలో రాష్ట్రాన్ని పెడితే జరిగే వినాశనమిది. నాటి పదేళ్ల దార్శనిక పాలనకు.. నేటి దగుల్బాజీ విధానాలకు మధ్య తేడాను నాలుగు కోట్ల సమాజం నిశితంగా గమనిస్తోంది. ఇక జీవితంలో ఈ ఢిల్లీ పార్టీలను తెలంగాణ నమ్మదు.. మళ్లీ ఎప్పటికీ మోసపోదు అని కేటీఆర్ స్పష్టం చేశారు.



## కోలుకుంటున్న మార్క్ శంకర్

మరో మూడు రోజులు ఆస్పత్రిలోనే చికిత్స

కొడుకు ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో పవన్ సంప్రదింపులు

మార్క్ ఫోటోను విడుదల చేసిన కుటుంబ సభ్యులు


2




## మోడీతో దేశానికి తీవ్ర నష్టం

ఆయనను తప్పిస్తేనే దేశానికి మోక్షం

రాహుల్ ఆదేశాలతో కులగణన చేపట్టాం

తెలంగాణ విముక్తికి పటేల్ కారణం

తెలంగాణ ఇచ్చిన సోనియా ధన్యురాలు

అహ్మదాబాద్ కాంగ్రెస్ సభలో రేవంత్ వ్యాఖ్యలు


2




జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# కోలుకుంటున్న మార్క్ శంకర్

**మరో మూడు రోజులు ఆస్పత్రిలోనే చికిత్స**
**కొడుకు ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో పవన్ సంప్రదింపులు**
**మార్క్ ఫోటోను విడుదల చేసిన కుటుంబ సభ్యులు**

**అమరావతి,ఏప్రిల్9(జై భీమ్ న్యూస్):**

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిన్నకుమారుడు మార్క్ శంకర్ పవనోవిచ్ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాడు. సింగపూర్‌లోని స్కూల్లో చోటు-చేసుకున్న అగ్నిప్రమాదంలో మార్క్ శంకర్ గాయపడ్డ సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో చిన్నారి మార్క్ కాళ్లు, చేతులకు గాయాలు కాగా, ఊపిరితిత్తుల్లోకి పొగ చేరింది. ప్రస్తుతం అతడు సింగపూర్‌లోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న పవన్ కళ్యాణ్ అప్పటికప్పుడు సింగపూర్‌కి బయలుదేరి వెళ్లగా.. పవన్ తర్వాత మెగాస్టార్ చిరంజీవి ఫ్యామిలీ కూడా మార్క్‌ని చూడడానికి వెళ్లారు. అయితే తాజాగా మార్క్ శంకర్ ఆసుపత్రిలో కోలుకుంటున్నట్లు ఫొటోను కుటుంబసభ్యులు విడుదల చేశారు. ఈ ఫొటోలో మార్క్ విజయానికి సంకేతం చూపిస్తున్నట్లుగా పోజ్ ఇచ్చాడు. కాగా ఇందుకు సంబంధించిన ఫొటో ప్రస్తుతం వైరల్‌గా మారింది. మరోవైపు మార్క్ పూర్తిగా కోలుకోవడానికి మూడు రోజులు పట్టనున్నట్లు సమాచారం. గత రాత్రి హైదరాబాద్ నుంచి సింగపూర్‌కు పవన్ కళ్యాణ్ సహా చిరంజీవి దంపతులు వెళ్లారు. పవన్ కళ్యాణ్ నేరుగా ఆసుపత్రికి చేరుకొని మార్క్‌ను కలిశారు. చేతులు, కాళ్లకు కాలిన గాయాలు కావడంతో పాటు, ఊపిరితిత్తులకు పొగ చేరడంతో అత్యవసర వార్డులో చికిత్స అందిస్తున్నట్లు తెలుస్తోంది. అక్కడ వైద్యులు, అధికారులతో పవన్ కళ్యాణ్ ఇప్పటికే మాట్లాడారు. మార్క్ కోలుకుంటున్నాడని, ఊపిరితిత్తుల దగ్గర పొగ చేరడంతో ఆ కారణంగా తలెత్తే ఆరోగ్యపరమైన ఇబ్బందుల గురించి పరీక్షలు చేస్తున్నామని వారు పవన్ దృష్టికి తీసుకొచ్చారు. మూడు రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణలోనే మార్క్‌కు పరీక్షలు చేయాల్సి ఉంటుందని ఆసుపత్రి వైద్యులు వెల్లడించారు. అయితే, తాజాగా మార్క్ శంకర్‌కు సంబంధించిన ఒక ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆ ఫోటోలో మార్క్ కాళ్లకు గానీ, చేతులకు గానీ ఇబ్బంది పెట్టే అంత గాయాలు అయితే కనిపించడం లేదు. మోచేతి దగ్గర ఒక కట్టుతో పాటు, ముఖానికి ఆక్సిజన్ సిలిండర్‌తో మార్క్ కనిపిస్తున్నాడు. రెండు చేతులతో థమ్సప్ చూపిస్తూ, తాను బాగానే ఉన్నానని చెప్పే ప్రయత్నం చేస్తున్నట్టు కనిపిస్తోంది.

# ఒంటిమిట్టలో కళ్యాణోత్సవానికి భారీగా ఏర్పాట్లు

**హాజరు కానున్న సిఎం చంద్రబాబు**
**70వేల లడ్డూలను సిద్ధం చేసిన టిటిడి**

**తిరుమల,ఏప్రిల్9(జై భీమ్ న్యూస్):**

కడప జిల్లా ఒంటిమిట్టలో శ్రీకోదండరామ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 11న సాయంత్రం 6.30 గంటల నుంచి 8.30 గంటల వరకు అత్యంత వైభవంగా శ్రీసీతారాముల కల్యాణాన్ని నిర్వహించనున్నారు. సిఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. టిటిడి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. రామచంద్రుడి కల్యాణానికి భారీ సంఖ్యలో భక్తులు హాజరుకానున్న నేపథ్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. భక్తుల కోసం తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని అందించేందుకు ఏర్పాట్లు చేసింది. ఇందుకోసం తిరుమలలోని శ్రీవారి సేవాసదన్-2లో బుధవారం శ్రీవారి సేవకుల సాయంతో తిరుమల లడ్డూలను ప్యాకింగ్ చేయించింది. డిప్యూటీ ఈవో శివప్రసాద్, ఏఈవో బాలరాజు ఆధ్వర్యంలో దాదాపు 300 మంది శ్రీవారి సేవకులు 70 వేల లడ్డూలను ప్యాకింగ్ చేశారు. వీటిని ఒంటిమిట్ట తరలిస్తున్నారు. ఇకపోతే ఒంటిమిట్టలో కళ్యాణోత్సవం సందర్భంగా భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. ప్రధానంగా మంచినీరు తదితర ఏర్పాట్లు చేశారు.

# కడియం శ్రీహరి రాజకీయ కృతఘ్నుడు

**కెసిఆర్ భిక్షతోనే ఎదిగిన కడియం**
**ఎదరుదాడికి దిగిన మాజీ ఎమ్మెల్యే రాజయ్య**

**జనగామ,ఏప్రిల్9(జై భీమ్ న్యూస్):**

స్టేషన్ ఘన్‌పూర్ రాజకీయం మరింత రసవత్తరంగా మారింది. బుధవారం మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి పై మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య తీవ్ర విమర్శలు గుప్పించారు. రాజకీయ వేదికపై ఈ స్థాయి వ్యక్తిగత వ్యాఖ్యలు కావడం హాట్ టాపిక్‌గా మారింది. తాటికొండ రాజయ్య చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతున్నాయి. ఆయన మాట్లాడుతూ, చనిపోయిన పాము కొస తోకకు ప్రాణం ఉన్నట్టు కడియం రాజకీయం ఉండేది అంటూ ఘాటుగా స్పందించారు. కడియం శ్రీహరికి రాజకీయ జన్మ ఇవ్వడంలో ముందుగా కేసీఆర్ పాత్ర ఉందని, రెండోసారి పల్లా రాజేశ్వర్ రెడ్డి సహకారంతోనే ఆయనకు ఎమ్మెల్యే టికెట్ లభించిందని రాజయ్య పేర్కొన్నారు. అలాగే, స్టేషన్ ఘన్‌పూర్ అభివృద్ధిలో పల్లా రాజేశ్వర్ రెడ్డి పాత్రను ప్రస్తావిస్తూ, వేడినీళ్లకు చన్నీళ్ల లాగా రాజేశ్వర్ రెడ్డి వ్యవహరించారు. అభివృద్ధి విషయాల్లో ఆయన పాత్ర గణనీయమైందని అన్నారు. కేసీఆర్ మాటల్లో ఎప్పుడూ కడియం పేరు రాలేదని, అయినప్పటికీ ఆయన తన స్థాయిని మరిచి ప్రెస్ మీట్‌లో సంబంధం లేని విషయాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇక కడియం శ్రీహరి పాలన గురించి మాట్లాడుతూ, ఇప్పుడిది ప్రజాస్వామ్యం కాదు, అక్రమ అరెస్టులతో ఒక వర్గానికి అనుకూలంగా పాలన సాగుతోంది. ప్రజల స్వేచ్ఛలు హరించబడుతున్నాయని ఆరోపించారు. అంతేకాకుండా... రాజకీయ జన్మనిచ్చిన స్టేషన్ ఘన్‌పూర్ ప్రజలకు జీవితాంతం గులామ్‌గిరి చేయాల్సిన బాధ్యత నీ మీద ఉంది అంటూ రాజయ్య హెచ్చరించారు. ఆయన కడియంపై ఆస్తుల విషయమై కూడా ఆరోపణలు చేశారు. దేవనూరు పరిసర ప్రాంతాల్లో బినామీ పేర్లతో భూములు ఉన్నాయా? కుటుంబంతో కలిసి పాలేరు ప్రాంతంలో వ్యవసాయం చేస్తున్నావా?' అంటూ ప్రశ్నలు సంధించారు. మొత్తం 23 మంది రైతులకు చెందిన 43 ఎకరాల 38 గుంటల భూమిని బినామీ పేర్లతో స్వాధీనం చేసుకున్నారని పేర్కొంటూ, ఇది వాస్తవం కాదా? అంటూ రాజయ్య నిలదీశారు. నీవు పతనమవుతున్న వ్యక్తివి అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

# ఆదర్శ సమాజంలో ఆదరణ కరువు

మొదటి పేజీ తరువాయి

పట్టించే విధంగా పాస్టర్ హత్య కేసు కు వ్యతిరేకంగా అసత్యపు మాటలతో స్పందిస్తున్నప్పుడు వాళ్లపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అధికార పక్షానికి ఒక రకమైన న్యాయం ప్రతిపక్షానికి మరొక రకమైన న్యాయం అవలంబిస్తుండడం అధికారుల తీరకు సరికాదన్నారు. అసలైన విషయం ఏమిటంటే ప్రభుత్వపక్షం ప్రతిపక్షం అనే సంబంధం లేకుండా కేసు విషయాన్ని అసలు కోణంలో విచారణ కొనసాగించడం తీవ్రమైన ఆలస్యం అవుతుందన్నారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల హత్య కేసు విచారణ మందకోడిగా సాగుతుంటే మరోవైపు పాస్టర్ అజయ్ బాబు అక్రమ అరెస్టు జైలుకు పంపించడం అంతా పక్కా ప్లాన్ ప్రకారం చేస్తున్నారన్నారు. పాస్టర్ అజయ్ బాబు తరఫున అక్రమ అరెస్టు జరిగిన రాత్రి 8 గంటల 30 నిమిషాల నుండి తెల్లవారుజాము వరకు జై భీమ్ సంస్థ యజమానిగా నేను, నాతోపాటు నా సంస్థలో పనిచేస్తున్న స్టేట్ బ్యూరో, ఆఫీస్ సబ్ ఎడిటర్స్, పాస్టర్ అజయ్ బాబు ఆచూకీ కనుక్కోవడం కోసం కుటుంబ సభ్యుల సమక్షంలో పోలీస్ అధికారులతో మాట్లాడుతూ రాత్రంతా తీవ్రంగా ప్రయాసపడ్డామన్నారు. అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా న్యాయం జరగాలని కేసు వాదిస్తున్న న్యాయవాది పాస్టర్ అజయ్ బాబు కేసు విషయంలో అధికారులకు చుక్కలు చూపిస్తున్నారన్నారు. ఇప్పటికే అక్రమంగా కేసులు పెట్టి జైలుకు పంపిన సీఐపై తెలంగాణ పోలీస్ శాఖ డీజీకి చర్యల కోసం వినతిపత్రం ఇవ్వగా, కమిషనర్ ఆఫ్ పోలీస్ ,జిల్లా కలెక్టర్ పలు ఉన్నతాధికారులకు సీఐపై కఠినమైన చర్యలు తీసుకోవాలని పాస్టర్ అజయ్ బాబు తరఫున న్యాయవాది ఒంటరిగా ప్రయాస పడుతుండడంతో పాటు, తన సమక్షంలోనే కుటుంబ సభ్యులు క్రైస్తవ సమాజంతో కలిసి అదే సీఐపై కఠినమైన చర్యల కొరకు పోరాటం కొనసాగిస్తున్నారన్నారు. అన్నిటికన్నా మించి హెచ్ఆర్సీలో సీఐపై కేసు వేయడం అది నెంబర్ కావడం త్వరలో విచారణ జరుగుతుండడం చూస్తుంటే అట్టి కేసులో హెచ్ఆర్సీ సదరు సీఐపై చర్యలకు ఆదేశించే ఆస్కారం ఉందన్నారు. ఏ అధికారి ఐన చట్టాన్ని చేతిలోనికి తీసుకొని ఎవరి పడితే వారిని అణిచివేస్తామని సొంత నిర్ణయాలతో ముందుకు వస్తే మూల్యం పతాక స్థాయిలో చెల్లించుకోక తప్పదన్నారు. పాస్టర్ అజయ్ బాబు అక్రమ అరెస్టు మొదలుకొని జైలుకు పంపే వరకు సిఐ నిర్వహించిన విధుల పట్ల హెచ్ఆర్సీలో క్షేత్రస్థాయి విచారణ సాగనుందన్నారు. కేసుకు సంబంధం లేని సెక్షన్స్ తో పాస్టర్ అజయ్ బాబును ఉక్కిరిబిక్కిరి చేసి పలు పోలీస్ స్టేషన్లలో కేసులు కట్టడమే కాకుండా తనను ఎక్కువ కాలం జైలుకే పరిమితం చేయాలని కుట్రలు పన్నిన్న తీరు వెనకాల ఉన్న ముఖ్యులెవరంటూ వాళ్లందరూ బయటకు రావాలన్నారు. ఖమ్మం అర్బన్ పోలీస్ స్టేషన్ లో పాస్టర్ అజయ్ కుమార్ పై హత్యకు కుట్ర కుట్ర చేసిన హంతకుల మీద క్రిమినల్ కేసు నమోదు అయినప్పటికిని సదరు సీఐ దానిని గోప్యంగా ఉంచుతూ కనీసం చర్యలు చేపట్టలేకపోతున్నారన్నారు. ప్రాణాపాయం ఉందని పోలీస్ అధికారుల ఆశ్రయిస్తే న్యాయం చేయాల్సిన పోలీసు అధికారులు పాస్టర్ అజయ్ బాబుపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపారన్నారు. త్వరలో పాస్టర్ అజయ్ బాబు కేసు వాదిస్తున్న న్యాయవాది రాత్రి వేళలో సమాచారం లేకుండా పాస్టర్ను అక్రమంగా అరెస్టు చేసిన విధానంపై కఠినంగా వ్యవహరిస్తూ కారకులైన అధికారులపై చర్యలు జరిగే వరకు వదిలిపెట్టేది లేదంటూ కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చినట్లు తెలిపారన్నారు. మత విద్వేషాలను రెచ్చగొడుతున్నది ప్రభుత్వాలు కాదా అంటూ సూటిగా ప్రశ్నించారు. ఇతర మతస్థులు క్రైస్తవులను పచ్చి బూతులతో తిడుతుంటే పోలీస్ అధికారులకు ఎందుకు కనిపించడం లేదన్నారు. మీడియాలో ఇంటర్వ్యూ ఇచ్చినందుకు పాస్టర్ అజయ్ బాబును జైలుకు పంపిస్తే అదే ఇంటర్వ్యూలలో క్రైస్తవ సమాజంపై పచ్చి బూతులు తిడుతున్న మతోన్మాదులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల హత్య కేసులో అసలు జరిగిన నిజాన్ని వెలుగులోనికి తేవడం కోసం హత్య జరిగిన సంఘటనను విచారించిన ఎమ్మార్వో, పోస్టుమార్టం నిర్వహించిన డాక్టర్లు, పాస్టర్ ఫోన్ ఆధారాలను విచారించిన సాంకేతిక పోలీసు అధికారులు, అన్ని రకాల ఆధారాలను సేకరించి విచారణ కొనసాగిస్తున్న పోలీసు ఉన్నత అధికారులతో కేసుకు సంబంధించిన వివరాలన్నింటినీ తక్షణమే బయట పెట్టాలన్నారు. "చాణక్యుని" మాట వింటే ఉద్యోగాలకు భద్రత ఉండదన్న సంగతిని అధికారులు మర్చిపోవద్దన్నారు. పోలీస్ శాఖ పరిధిలో పరిష్కారం లభించాల్సిన పాస్టర్ హత్య కేసును నాన్చుకుంటూ.... నాన్చుకుంటూ..... కోర్టు మెట్లు ఎక్కించే క్రమం చేసినట్లయితే దానికి పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. మృతదేహం పడిపోయిన స్థలంలో జరిగిన సంఘటనను ఎల్కేజీ విద్యార్థికి చూపించిన హత్యనని సునాయాసంగా చెప్పగలడని అలాంటిది అధికారులు కేసును విచారిస్తున్నమంటూ అసలు విషయాలను ఎందుకు దాటేస్తున్నారన్నారు. ఒకవైపు పాస్టర్ ప్రవీణ్ పగడాల హత్య కుటుంబంతోపాటు బంధువులను స్నేహితులను తను పరిచర్య కొనసాగించిన వేలాది, లక్షలాదిమంది క్రైస్తవులతో పాటు దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా క్రైస్తవులను కలచివేస్తుంటే మరోవైపు చరిత్ర కలిగిన తన జీవితంపై చెదిరిపోలేని చెడు ముద్రలను వేస్తూ అల్పానందం పొందుతున్న కుట్ర దారులు కేసు విచారణపై బలవంతమైన ప్రభావాన్ని రుద్దుతున్నారన్నారు. ఒక్క పాస్టర్ హత్య కేసు విచారణను ప్రపంచవ్యాప్తంగా ఎన్ని కోట్ల మంది చర్చించుకుంటున్నారో దాన్నిబట్టి చూస్తే పాస్టర్ ప్రవీణ్ పగడాలకు ఉన్నటువంటి వ్యక్తిగత కీర్తి ప్రతిష్టలు ఎంత గొప్పవో అర్థం చేసుకోవాలన్నారు. విచారణ సాగదు వివరాలు వెలుగులోనికి రావనే కోణంలో సంబంధం లేని వ్యక్తులపై విచారణ పేరున కేసు దర్యాప్తును దారిమళ్లిస్తూ అసలు విషయాలను అదుపు చేస్తామంటే క్రైస్తవ సమాజం సహించదన్నారు. ఆదర్శవంతమైన సమాజంలో జీవిస్తూ అణిచివేతే మా లక్ష్యం అనే విధంగా ప్రభుత్వాలు గానీ అధికారులు గానీ ప్రదర్శించినట్లయితే ఆదరణకు నోచుకోని సామాన్యులంతా ఏకమై ప్రభుత్వాలను పతనం చేస్తాయన్న సంగతిని గుర్తుకు పెట్టుకోవాలన్నారు. చలి చీమలు ఏం చేస్తాయి లే అని వదిలేస్తే విష సర్పాన్ని సైతం హతమార్చగలవు అన్న సంగతిని గుర్తించాలన్నారు. క్రైస్తవ సమాజం శాంతికి నిలయం,విశ్వాసానికి ఆదర్శం, క్రీస్తు బోధనలను క్రమశిక్షణతో పాటించేవాళ్లుగా సమాజంలో శాంతి మార్గంలో జీవిస్తారు అనుకోని కేసును ఇష్టానుసారంగా నడిపిస్తామని అనుకుంటే రాష్ట్ర ప్రభుత్వమే తీవ్రమైన ప్రమాదంలో పడే ఆస్కారం ఉంటుందన్నారు. క్రైస్తవుల ఓపికను, క్రైస్తవుల సహనాన్ని, క్రైస్తవుల విశ్వాసాన్ని ,క్రైస్తవుల నిజాయితీని ,తక్కువ అంచనా వేయకూడదని సూచిస్తూ అదే క్రైస్తవ సమాజాన్ని లోతైన విధంగా అణిచివేసి, హతమార్చే విధంగా ఆదరణ లేకుండా చేస్తామనుకుంటే రానున్న కాలంలో ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పక తప్పదన్నారు. కేసును తప్పుడు మార్గంలో విచారించమని ఒత్తిడి తీసుకొచ్చే మూరు?లకు సిగ్గు, శరం, మానం ,ఏమాత్రం లేవన్నారు. మానవత్వం కలిగిన మనిషి ఎవడైనా కేసు విచారణను తప్పుడు కోణంలో విచారించి ఆక్సిడెంట్ గా చిత్రీకరించి మూసివేయుండని చెబుతాడా అంటూ అలాంటి నాయకులు తీవ్రమైన దూషణలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఏ వ్యవస్థ పని ఆ వ్యవస్థ నిజాయితీగా చేసినాక ఎందుకు అసలు నిజాలు మరుగున పడుతాయన్నారు. కేసు విచారణను నిష్పక్షపాతంగా విచారించి హంతకులను కఠినంగా శిక్షించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. లేనిపక్షంలో ఆదర్శవంతమైన సమాజంలో అనగారిన వర్గాలకు ఆదరణ కరువై నిరంతర అణిచివేత కొనసాగించబడుతుందని సభ్య సమాజం బలంగా విశ్వసించాల్సి వస్తుందన్నారు.

# సవాళ్లకు అనుగుణంగా పోలీస్ శాఖ సన్నద్ధం

**సైబర్ ఫ్రాడ్ నేరాలపై ప్రత్యేక దృష్టి**
**పరిశ్రమల్లో మహిళా ఉద్యోగుల రక్షణ కోసం షీ టీమ్**
**డీజీపీ జితేందర్ వెల్లడి**

**హైదరాబాద్,ఏప్రిల్9(జై భీమ్ న్యూస్):**


వాణిజ్య రంగంలో మారుతున్న సవాళ్లకు తగిన విధంగా స్పందించేందుకు తెలంగాణ పోలీస్ శాఖ ముందడుగు వేస్తోందని డీజీపీ జితేందర్ తెలిపారు. ముఖ్యంగా సైబర్ ఫ్రాడ్ నేరాలను అరికట్టేందుకు ఐజీ ర్యాంక్ అధికారిని ప్రత్యేకంగా నియమించామన్నారు. గంజాయి, డ్రగ్స్ నియంత్రణ కోసం నార్కోటిక్స్ బ్యూరో ఏర్పాటుచేసినట్లు వెల్లడించారు. పరిశ్రమల్లో మహిళా ఉద్యోగుల రక్షణ కోసం షీ టీ-మ్‌ను ఏర్పాటు చేయడం, వారి ప్రయాణ సౌకర్యార్థం షీ షటిల్ బస్సులు అందుబాటులోకి తేవడం వంటి చర్యలను వివరించారు. తెలంగాణ వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య ఆధ్వర్యంలో మెరుగైన పోలీస్ నిఘా , ప్రజా భద్రతపై రాష్ట్ర డీజీపీ జితేందర్‌తో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సాంకేతిక పోలీసింగ్, సైబర్ భద్రత, మహిళా ఉద్యోగుల రక్షణ, ప్రభుత్వ-ప్రైవేట్ రంగాల భద్రతా సహకారంపై చర్చ జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీజీపీ జితేందర్ మాట్లాడుతూ, ప్రభుత్వ-ప్రైవేట్ రంగాల మధ్య భద్రత విషయంలో అంతరాన్ని తగ్గించడమే ఈ సమావేశ ఉద్దేశం అన్నారు. పరిశ్రమల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. వేధింపులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటు-న్నామన్నారు. గత ఐదేళ్లలో తెలంగాణ ప్రభుత్వం పోలీస్ శాఖకు రూ.800 కోట్లు మంజూరు చేసినట్లు- జితేందర్ తెలిపారు. 100 డయల్ సేవలు మెరుగు పడటంతోపాటు పోలీస్ పనితీరు దేశంలోనే కాక, అంతర్జాతీయంగా ప్రశంసలందుకుంటోందని పేర్కొన్నారు. తెలంగాణలో అన్ని రంగాల అభివృద్ధి పోలీస్ భద్రతపై ఆధారపడి ఉంది. శాంతి భద్రతలను కాపాడడంలో మా బాధ్యతను నిజాయితీగా నిర్వర్తిస్తున్నాం, అని డీజీపీ జితేందర్ తెలిపారు. ఈ సమావేశం వాణిజ్య, పరిశ్రమల రంగం నుంచి విశేష స్పందన పొందింది. భద్రత , నిఘాపై ప్రభుత్వ నిర్ణయాలు పరిశ్రమల విశ్వాసాన్ని పెంచుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమైంది.

# మోడీతో దేశానికి తీవ్ర నష్టం

**ఆయనను తప్పిస్తేనే దేశానికి మోక్షం**
**రాహుల్ ఆదేశాలతో కులగణన చేపట్టాం**
**తెలంగాణ విముక్తికి పటేల్ కారణం**
**తెలంగాణ ఇచ్చిన సోనియా ధన్యురాలు**
**అహ్మదాబాద్ కాంగ్రెస్ సభలో రేవంత్ వ్యాఖ్యలు**

**అహ్మదాబాద్,ఏప్రిల్9(జై భీమ్ న్యూస్) :**

ప్రధాని మోదీ మతాల మధ్య చిచ్చు పెట్టి దేశాన్ని విభజించాలని చూస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఘాటు విమర్శలు చేశారు. మోడీని తప్పిస్తే తప్ప దేశానికి విముక్తి లేదని అన్నారు. గాంధీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పనిచేస్తూ గాడ్సే సిద్దాంతాన్ని ప్రోత్సహిస్తున్నారని రేవంత్ విమర్శించారు. దేశ యువత ఏకం కావాల్సిన సమయమొచ్చిందన్నారు. యువతకు గాంధీ బాటలో నడుస్తూ.. మోదీ, గాడ్సేలను ఓడించాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అంటే ప్రధాని మోదీకి భయం..మోదీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతాడనే లోక్‌సభలో రాహుల్ గాంధీకి మైక్ ఇవ్వలేదని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వంలో మోదీకి, అమిత్ షాకు ఉద్యోగాలు వచ్చాయి తప్ప.. నిరుద్యోగ యువతకు ఒక్క ఉద్యోగం కూడా రాలేదని రేవంత్ రెడ్డి విమర్శించారు. నెహ్రూ నేతృత్వంలో పటేల్ నిజాం నుంచి తెలంగాణకు విముక్తి కలిగించారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చింది సోనియాగాంధీ.. దేశాన్ని విభజించడమే మోదీ లక్ష్యం అందుకే తెలంగాణలో బీజేపీని, మోదీని అడుగు పెట్టనివ్వం అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ గాంధీ సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్తుంది.దేశ యువత ఏకమై మోదీకి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన -టైం వచ్చిందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. దేశంలో కుల గణన చేపట్టిన తొలి రాష్ట్రం



తెలంగాణే అని గర్వంగా తెలిపారు. రాష్ట్రంలోని కుల గణనను తాము విజయవంతంగా పూర్తి చేశామని, అదే తరహాలో దేశవ్యాప్తంగా కూడా జనాభా గణనతో పాటు కుల గణన జరగాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ ప్రకారం 21 వేల కోట్ల వ్యవసాయ రుణాలను మాఫీ చేశామని వెల్లడించారు. రైతులపై భారం తగ్గించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈ నిర్ణయం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీపాలనలో దేశానికి అభివృద్ధి కన్నా మోసం ఎక్కువగా జరిగిందని ఆరోపించారు. రాహుల్ గాంధీతో కలిసి గాంధీ పరివారమంతా పనిచేయాలని రేవంత్ పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యం, సమానత్వం, నైతికత కోసం పోరాడే నాయకుడిగా రాహుల్ గాంధీని ఆదరించాలని కోరారు. కాగా మోడీ పరివారాన్ని గాడ్సే పరివారంగా అభివర్ణించి తీవ్ర విమర్శలు చేశారు. బ్రిటిష్ వాళ్లు ఎలా దేశ సంపదను లూటీ చేశారో, అదే బాటలో బీజేపీ నాయకులు కూడా నడుస్తున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దేశ ప్రజల ఆస్తులు ప్రైవేటు కార్పొరేట్‌లకు అప్పగిస్తున్నారని విమర్శించారు. వచ్చే రోజుల్లో దేశం మీద విపరీతంగా పెరుగుతున్న బీజేపీ చెరను తొలగించాలన్న బాధ్యత ప్రతి కార్యకర్త తీసుకోవాలని రేవంత్ పిలుపునిచ్చారు. తెలంగాణలో బీజేపీ అడుగుపెట్టనివ్వకపోవడం తమ గెలుపు సూచిక అని పేర్కొన్నారు.

# సంపాదకీయం

## ప్రతిభాశాలి యజ్ఞేశ్వర చింతామణి

చిర్రావూరి యజ్ఞేశ్వర చింతామణి. ఈ పేరు చాలా మందికి తెలియనిది. నేటి జర్నలిస్టులు గాని, రాజకీయ నాయకులు గానీ చింతామణి గురించి ఎక్కువగా విని ఉండక పోవచ్చు. ఆయన ఒక తెలుగువాడిగా పుట్టడం తెలుగు వారందరికీ గర్వ కారణం. చదువులో రాణించలేక పోయినా, ఆంగ్ల భాషలలో విశ్వవిద్యాలయ పట్టాలేకున్నా, పుట్టిన గడ్డను వదిలి, నిండా 18 ఏళ్లు నిండకుండానే, ఒక ఆంగ్లపత్రికకు సంపాదకుడుగా కాగలిగి, దాదాపు మూడు దశాబ్దాల కాలం అదీ ఇంగ్లీషు వారి పరిపాలనా సమయంలో ముఖ్య సంపాదకత్వ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించిన అసమాన ప్రతిభాశాలి చింతామణి. చిర్రావూరు యజ్ఞేశ్వర చింతామణి 1880-1941) పోప్ ఆఫ్ ఇండియన్ జర్నలిజంగా పేరుపొందిన ప్రసిద్ధ పాత్రికేయులు, ఉదారవాద రాజకీయ నాయకులు. అలహాబాదు నుండి వెలువడిన లీడర్ అనే ఆంగ్ల పత్రికకు 1909 నుండి 1934 వరకు మూడు దశాబ్దాలపాటు సంపాదకత్వం వహించారు. ఈయన ఇండియన్ హెరాల్డ్, స్టాండర్డ్ పత్రికలను కూడా వ్యవస్థీకరించారు. 1880 ఏప్రిల్ 10న తెలుగు నూతన సంవత్సరాది నాడు చింతామణి జన్మించారు. విజయనగరం ఆస్థానంలో రాజపురోహితులు. ఆయన తండ్రి చిర్రావూరు రామసోమయాజులు, వేదపండితుడు, విజయనగరం సంస్థానంలో మహారాజా విజయరామ గజపతిరాజుకు రాజగురువు. తాతలు, తండ్రుల లానే చింతామణి కూడా పురోహితులు అవుతారని అందరూ అనుకున్నారు. యజ్ఞేశ్వర చింతామణికి 10 యేటనే వివాహమైనది. చింతామణి అనారోగ్యం వల్ల, మాతృవియోగం వల్ల ఎఫ్.ఏ పరీక్షలో ఉత్తీర్ణుడు కాలేక పోయారు. అయితే, యువరాజా సూచనతో, విజయనగరం మహారాజా కాలేజ్‌లో ఇంగ్లీషు చదువుకోసం వెళ్ళినా, చింతామణి విశాఖలో స్థానిక రాజకీయ వ్యక్తులతో తిరగటం ప్రారంభించారు. విశ్వవిద్యాలయాల నుండి పట్టాలు పొందలేక పోయాయినా, అసమానమైన ఆంగ్లభాషా పాండిత్యాన్ని సంపాదించారు. చదువుకొనే రోజుల్లోనే పత్రికలకు వ్యాసాలు రాశారు చింతామణి. స్వయంకృషితో పట్టుసాధించి, అనేక సభలలో ఉపన్యాసాలను ఇచ్చేవారు. పత్రికా రచనపై ఆయనకు ఆసక్తి మెండుగా ఉండేది. ప్రారంభ దశలో "తెలుగు హార్స్" అనే పత్రికకు సంపాదకుడిగా ఉన్నారు. ఈయన వ్రాసే వ్యాసాలు వైజాగ్ స్పెక్టేటర్ పత్రికలో అచ్చు అవటం ప్రారంభమైంది. ఆ తర్వాత కొంతకాలానికే 18 యేళ్ల వయసులోనే వైజాగ్ స్పేక్టేటర్ పత్రికకు సంపాదకత్వం వహించే అవకాశం లభించింది. అప్పట్లో 30 రూపాయలు జీతం ఇచ్చారు. ఆ తరువాత చింతామణి ఆ పత్రికను 300 రూపాయలకు కొని, తనతో పాటు వైజాగ్ స్పెక్టేటర్ పత్రికను విజయనగరానికి తీసుకొచ్చారు. తర్వాత ఆ వారపత్రికకు "ఇండియన్ హెరాల్డ్" అని నామకరణం చేశారు. ఆ తర్వాత ఈ విషయాన్ని జ్ఞప్తికి తెచ్చుకుంటూ చింతామణీ "నేను కేవలం సంపాదకుడినేకాదు, ఫోర్మెన్, ప్రూఫ్ రీడర్, విలేఖరి, ఉపసంపాదకుడు, యజమాని అన్నీ నేనే' అని వివరించారు. పత్రిక బాగా ప్రాచుర్యం పొందినా ఆర్థిక ఇబ్బందుల వల్ల రెండు సంవత్సరాలలో దాన్ని మూసివేయవలసి వచ్చింది. ఆ సమయంలోనే చింతామణి భార్య మృతి చెందగా, మద్రాసుకు మకాం మార్చి, కొంతకాలం యునైటెడ్ ఇండియా అనే వారపత్రికలోను, ఆ తర్వాత జి. సుబ్రమణ్యం అయ్యర్ సంపాదకత్వంలో వెలువడుతున్న "మద్రాస్ స్టాండర్డ్" దినపత్రికలో ఒక సంవత్సరం పాటు పనిచేశారు. 1903లో నాగేంద్రనాథ్ గుప్తా ప్రారంభించిన "ఇండియన్ పీపుల్" పత్రికకు సంపాదకత్వం వహించడానికి అలహాబాదు మకాం మార్చారు. 1909 అక్టోబరులో మదన్ మోహన్ మాలవ్యా, తేజ్ బహద్దర్ సప్రూ వంటి మితవాద కాంగ్రెస్ నాయకులు "లీడర్" అనే ఆంగ్ల దినపత్రికను ప్రారంభించారు. "ఇండియన్ పీపుల్" పత్రిక "లీడర్" పత్రికలో కలిసిపోయింది. చింతామణి లీడర్ పత్రిక సంపాదకత్వ బాధ్యతను స్వీకరించారు. చింతామణి నిష్పక్షపాతమైన విమర్శకుడిగా పేరు గడించారు. ఈ పత్రికలోని సంపాదకీయాలు ఇతడికి మంచి పేరు ప్రతిష్ఠలను తెచ్చిపెట్టగా, 1916 వరకు లీడర్ పత్రికా సంపాదకుడిగా ఉన్నారు. 1927నుండి మళ్లీ లీడర్ పత్రికకు సంపాదకునిగా వ్యవహరించారు. పత్రికా రంగంతో పాటు రాజకీయాలపై కూడా ఆసక్తి ఉంది. 20 సంవత్సరాలు కూడా నిండని వయసులో 1900 సంవత్సరం చివరలో లాహోరులో జరిగిన అఖిల భారత జాతీయ కాంగ్రెస్ మహాసభలకు హాజరయ్యేందుకు ప్రయాణ ఖర్చులకు డబ్బు లేకపోతే అప్పుచేసి వెళ్లారు. ఆ సమావేశాలలో అనేక విషయాలపై ఆయన చేసిన గంభీరమైన ఉపన్యాసాలు. సురేంద్రనాథ్ బెనర్జీ, భూపేంద్రనాథ్ బోస్ వంటి కాంగ్రెస్ నాయకుల ప్రశంసా పాత్రాలు అయినాయి. "హిందూ" పత్రిక ఆ ఉపన్యాసాలను ప్రశంసించింది. 1916లో తిరిగి 1927లోనూ ఉమ్మడి మద్రాసు రాష్ట్ర శాసనమండలి సభ్యులుగా ఎన్నికైనారు. 1921-23 మధ్య అప్పటి యునైటెడ్ ప్రావిన్సెస్ (నేటి ఉత్తరప్రదేశ్)కు విద్య, పరిశ్రమల శాఖల మంత్రిగా పనిచేశారు. 1930-31లో లండన్‌లో జరిగిన మొదటి రౌండ్ టేబుల్ సమావేశానికి ప్రతినిధిగా హాజరైనారు. కాంగ్రెస్ వాదిగా రాజకీయాలలో పాల్గొని, గాంధీ సహాయ నిరాకరణ, శాసనోల్లంఘన ఉద్యమాలతో విభేదించి, మితవాదిగా పంథా మార్చుకున్నారు. అయినా గాంధీ, నెహ్రూతో సహా నాటి నేతలంతా చింతామణిని అభిమానించేవారు. బ్రిటీషు ప్రభుత్వం ఆయనకు 1939లో సర్ బిరుదునిచ్చి సత్కరించింది. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేటు (ఎల్.ఎల్.డి)ప్రదానం చేసింది. అలహాబాద్ విశ్వవిద్యాలయం డి.లిట్. గౌరవ పట్టాను ఇచ్చింది. తెలుగు తేజాన్ని, రాజకీయ పరిజ్ఞానాన్ని భారతదేశ మంతటా చాటిన చింతామణి 1941, జూలై 1 న తన 62వ యేట మరణించారు. మరణించిన దినాన సైతం ఆయన స్వీయ సంపాదకీయం రాయడం గమనార్హం.

## టీచర్ పోస్టులపై సిబిఐ దర్యాప్తు అక్కర్లేదు

పశ్చిమబెంగాల్‌లో ఉపాధ్యాయ నియామక కుంభకోణం కేసులో అదనపు పోస్టుల సృష్టిలో సీబీఐ దర్యాప్తు నిమిత్తం హైకోర్టులో ఇచ్చిన ఆదేశాల్లో కొన్నింటిని సుప్రీం కోర్టు తాజాగా పక్కనపెట్టింది. అదనపు పోస్టుల సృష్టిపై రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయంలో సీబీఐ దర్యాప్తు అవసరం లేదని స్పష్టం చేసింది. దీంతో మమతా బెనర్జీ ప్రభుత్వానికి స్వల్ప ఊరట లభించింది. పశ్చిమబెంగాల్ విద్యాశాఖ నిపుణులతో చర్చించిన తర్వాతనే ఈ అదనపు పోస్టులను సృష్టించిందని, దీనికి గవర్నర్ నుంచి ఆమోదం లభించిందని, అలాంటప్పుడు ఇందులో న్యాయమైన జోక్యం అవసరం లేదని చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వం లోని ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే టీచర్ల నియామకాల్లో ఇతర అవకతవకలకు సంబంధించిన ఇతర అంశాలు, ఆరోపణలపై సీబిఐ దర్యాప్తు కొనసాగుతుందని కోర్టు పేర్కొంది. 2016 లో పశ్చిమబెంగాల్‌లో ఉపాధ్యాయులతోపాటు సిబ్బంది నియామకాల ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు రావడం, దీనిపై కలకత్తా హైకోర్టు, సుప్రీం కోర్టు ఈ ప్రక్రియ చెల్లదని తీర్పు ఇవ్వడం తెలిసిందే. అయితే ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వ అధికారుల పాత్రతోపాటు అవకతవకలపై దర్యాప్తు జరపాలని హైకోర్టు సీబీఐని ఆదేశించింది. దీన్ని సవాల్ చేస్తూ బెంగాల్ ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దీనిపై గతంలో విచారణ జరిపిన సుప్రీం కోర్టు .. సిబీఐ దర్యాప్తుపై స్టే విధించింది. తాజాగా అదనపు ఉద్యోగాల సృష్టిపై దర్యాప్తు అవసరం లేదంటూ తీర్పు చెప్పింది.

# ఆక్వాను వదలని ట్రంప్ టారీఫ్‌లు

'అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా చేద్దాం, అమెరికా ఫస్ట్' నినాదాలతో అమెరికా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ తన దూకుడు స్వభావంతో వాణిజ్య యుద్ధానికి తెర లేపాడు. ఏప్రిల్ రెండవ తేదీన వాణిజ్య లోటును తగ్గించడం, దేశీయ తయారీని ప్రోత్సహించే లక్ష్యంతో వ్యాపార సంబంధ దేశాలపై ప్రతీకార సుంకాలను విధించాడు. పెంచిన సుంకాలు ఏప్రిల్6 నుండే అమలవుతాయని అమెరికా స్పష్టం చేసింది. ఈ సుంకాల వల్ల 60 పైగా దేశాలు ప్రభావితం అవుతున్నాయి. భారత్‌పై 27 శాతం, చైనాపై 34 శాతం, తైవాన్‌పై 32 శాతం, జపాన్‌పై 24 శాతం, యూరోపియన్ యూనియన్‌పై 32 శాతం, ఇతర దేశాలపై 10 శాతం సుంకాలు విధించారు. భారత్‌కు అమెరికా అతి పెద్ద వాణిజ్య భాగస్వామి. 2024 ఆర్థిక సంవత్సరంలో అమెరికాకు ఎగుమతుల విలువ 77.5 బిలియన్ డాలర్లు. భారత్ నుండి ఎగుమతి అయ్యే ప్రధాన వస్తువులు ఎలక్ట్రానిక్స్, రత్నాలు, ఆభరణాలు, ఫార్మా ఉత్పత్తులు, యంత్రాలు, పెట్రోలియం ఉత్పత్తులు. అయితే ఈ సుంకాల ప్రభావం భారత ఆర్థిక వ్యవస్థపై గణనీయంగా పడనుంది. ముఖ్యంగా మన రాష్ట్రానికి సంబంధించిన సీ ఫుడ్స్, ఆక్వా రంగాలను తీవ్రంగా నష్టపరచనున్నాయి. రొయ్యల ఉత్పత్తిలో భారతదేశం అగ్రస్థానంలో ఉంది. 2022-23 సంవత్సరంలో భారత్ నుండి 63.969 కోట్ల విలువ కలిగిన 1.73 మిలియన్ టన్నుల మత్స్య ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయి. అమెరికా మత్స్య ఉత్పత్తులకు పెద్ద మార్కెట్. మొత్తం 5.6 బిలియన్ డాలర్ల విలువైన రొయ్యలు ఎగుమతి అయితే అందులో 2.4 బిలియన్ డాలర్ల విలువైన రొయ్యలు అమెరికాకు ఎగుమతి అయ్యాయి. దాదాపు 40 శాతం మార్కెట్ వాటా భారత్‌దే. మన దేశం నుండి విదేశాలకు ఎగుమతి అవుతున్న మాంస ఉత్పత్తిల్లో రొయ్యలు మూడవ స్థానంలో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకాకుళం నుండి నెల్లూరు జిల్లా వరకు ఆక్వా కల్చర్ అభివృద్ధి ఉంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుండి అత్యధికంగా ఆక్వా ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. ఈ జిల్లాలో దాదాపు 1.20 లక్షల ఎకరాలు, రాష్ట్ర వ్యాప్తంగా 5.75 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగవుతుంది. పశ్చిమ గోదావరి నుండే 3.5 లక్షల టన్నుల రొయ్యలు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. మొత్తం 18 వేల కోట్ల వ్యాపారం జరుగుతుంది. ఇందులో విదేశీ ఎగుమతుల వాటానే అధికం. కోవిడ్-19 కారణంగా ఎగుమతులు నిలిచిపోయి పరిశ్రమ నష్టాల్లో కూరుకుపోయింది. దీనికి తోడు వైరస్‌ల బెడద, ధరలు పతనం కావడం, రైతులకు సాగు పెట్టుబడి పెరిగి పోవడంతో ఆక్వా పరిశ్రమ ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నది. ఇటువంటి సమయంలో ట్రంప్ 27 శాతం సుంకాలు విధించడంతో పరిస్థితులు మరింత దిగజారిపోతున్నాయి. అమెరికా సుంకాలు విధించగానే 100 కౌంట్ రొయ్య ధర 240 నుండి 200 రూపాయలకు పడిపోయింది. కంపెనీలు కొనడానికి ముందుకు రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. మరోవైపు అమెరికా ఏప్రిల్-6వ తేదీ నుండే సుంకాల పెంపు అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. ఇప్పటికే ఒప్పందాలు కుదుర్చుకున్న వాటి పరిస్థితి ఏంటి? ఆరవ తేదీ తరువాత అమెరికా రీచ్ అయ్యే ప్రతి సరుకుపై పెరిగిన సుంకాలు అమలు చేస్తామని అమెరికా అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ టారిఫ్ అమలైతే లక్ష రూపాయలు విలువ చేసే రొయ్యలు అమెరికాకు ఎగుమతి చేస్తే 26 వేల రూపాయల పన్ను కట్టాలి. అంతేకాకుండా రవాణా, ప్యాకింగ్, ఇతర ఖర్చులు కలిపి దాదాపు 50 శాతం పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే భారత్ ఎగుమతులపై యాంటీ డంపింగ్ డ్యూటీలు (ఎ.డి.డి)-3.88 శాతం, కౌంటర్ వైలింగ్ డ్యూటీలు (సి.వి.డి)-5.77 శాతం సుంకాలను వసూలు చేస్తున్నారు. కొత్తగా ప్రకటించిన టారిఫ్‌తో కలుపుకుంటే 35 శాతం వరకు ఉంటుంది. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా సుమారుగా 1 లక్ష టన్నుల రొయ్యలు ఎగుమతికి సిద్ధంగా ఉన్నాయి. ఇవి కోల్డ్ స్టోరేజ్‌లో ఉన్నాయి. అమెరికాకు 20-40 కౌంట్ ఉన్న రొయ్యలనే ఎగుమతి చేస్తారు. ఎగుమతిదారులు 30 కౌంట్ రొయ్యలను 480 రూపాయలకు కొని కోల్ట్ స్టోరేజ్‌లో నిల్వ ఉంచారు. కొత్త టారిఫ్ ప్రకారం ఎగుమతి చేస్తే మరో 80 రూపాయలు అదనంగా ఖర్చు అవుతుంది. అంటే టన్నుకు రూ.8.50 లక్షలు నష్టం వస్తోంది. ఉన్న సరుకును ఎగుమతి చేయలేరు. కోల్డ్ స్టోరేజ్ ఖర్చులు భరించలేరు. మరోవైపు వడ్డీల భారం ఉండనే ఉంది. ఈ సుంకాల విధింపు వల్ల ఎగుమతిదారులే కాకుండా.. రొయ్యల రైతులు, కార్మికులకు తీవ్ర నష్టం జరగనుంది. ఒడిదుడుకుల ప్రభావం మొట్టమొదట పడేది రైతులు, కార్మికుల పైనే. కౌలుకు తీసుకుని సాగు చేసే రైతుల పరిస్థితి మరింత దారుణం. సాగుతో పాటు దీనికి అనుబంధంగా ఉన్న ఫీడ్ కంపెనీలు, టెస్టింగ్ ల్యాబులు, మెడిసిన్ కంపెనీలు, ప్యాకింగ్ యూనిట్లు, ఇందులో పని చేసే కార్మికులపై వీటి ప్రభావం తీవ్రంగా పడుతుంది. రాష్ట్రంలో 450 పైగా రొయ్యల హేచరీలు, 50 పైగా ఫీడ్ మిల్లులు, 2 లక్షల పైగా రొయ్యల చెరువులు, 250 ప్రాసెసింగ్ ప్లాంట్లు, 6 వేలకు పైగా పడవలు, నౌకల ద్వారా కూడా వేలాది మందికి ఉపాధి కల్గుతుంది. 1.5 లక్షల మంది రైతులున్నారు. ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షల మందికి ఆక్వా పరిశ్రమ ఉపాధి చూపుతుంది. పరిశ్రమ సంక్షోభంలోకి వెళ్లిపోతే వీరంతా ఉపాధిని కోల్పోతారు. ట్రంప్ భారత పర్యటన సందర్భంలోనే భారత్‌పై సుంకాలు విధిస్తానని ప్రకటించినా కేంద్ర ప్రభుత్వం అప్రమత్తం కాలేదు. అమెరికాతో సత్సంబంధాలు ఉన్నా సంప్రదింపులు జరపలేదు. ట్రంప్ నా స్నేహితుడు, హౌడీ-మోడీ అని ప్రచారం చేసిన ప్రధాని ఇప్పుడు స్పందించటంలేదు. అక్రమ వలసదారుల పేరు చెప్పి భారతీయుల కాళ్లకు గొలుసులు కట్టి బానిసల్లా ఇండియాకు పంపినా నోరు మెదపలేదు. సుంకాలు విధించి ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తున్నా కిమ్మనడం లేదు మన ప్రధాని. దీంతో రూ.18 వేల కోట్ల టర్నోవర్ కలిగిన ఆక్వా పరిశ్రమ సంక్షోభంలోకి వెళ్లిపోతుంది. లక్షల మంది రైతులు, కార్మికులు, ఎగుమతిదారులు నష్టపోతున్నారు. కేంద్రంపై ఒత్తిడి తేవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం సిక్స్, ఫోర్ అంటూ పథకాల ప్రచారంలో మునిగిపోయింది. ఈక్విడార్ నుండి ఎగుమతిలో గట్టి పోటీ ఎదురవుతుంది. ఇదే అలసత్వం ప్రభుత్వాలు ప్రదర్శిస్తే, ఇండియన్ మార్కెట్ అంతా ఈక్విడార్, ఇండోనేషియా వంటి దేశాలకు షిఫ్ట్ అయిపోతుంది. ఆక్వా రంగం నిలదొక్కుకోవాలంటే ఎగుమతులను ప్రోత్సహించే చర్యలు తీసుకోవాలి. దేశీయ మార్కెట్‌ను అభివృద్ధి చేసే విధంగా, అమెరికాపై ఆధార పడకుండా ప్రత్యామ్నాయ మార్కెట్లను ఏర్పాటు చేసుకోవడానికి దీర్ఘకాల వ్యూహాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉంది. తక్షణ ఉపశమనంగా రైతుల రుణాలను రీషెడ్యూల్ చేయాలి. ఎగుమతిదారులకు, కార్మికులకు ఆర్థికంగా అండగా నిలవాలి. ఎ.పి ఆర్థిక వ్యవస్థలో ఆక్వా రంగం కీలకమైంది. కనుక దీన్ని కాపాడాల్సిన అవసరం ప్రభుత్వానికి ఎంతైనా ఉంది.




# గాంధేయవాది మొరార్జీ దేశాయ్

తాను నమ్మిన సిద్ధాంతాలతో ఏనాడూ రాజీపడని విలక్షణ వ్యక్తిత్వం దివంగత ప్రధాని మొరార్జీ దేశాయ్‌కే సొంతం. మొరార్జీ దేశాయ్ దృష్టిలో నిజాయితీ అనేది ఒక విశ్వాసం తప్ప అవసరం కాదు. ఎట్టి పరిస్థితుల్లో అయినా ఆయన తాను నమ్మిన సిద్ధాంతాలకే కట్టుబడి ఉండేవారు. క్లిష్టమైన సందర్భాల్లో కూడా ఆయన రాజీపడిన దాఖలాలు లేవు. 'జీవితంలో ప్రతి ఒక్కరూ నిజాయితీకి కట్టుబడి నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉండాలన్న ధర్మ సూత్రాన్ని' మొరార్జీ దేశాయ్ ఆచరించి చూపించారు. ధృఢమైన గాంధేయవాదిగా దేశాయ్, ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ సోషలిస్టు విధానాలకు వ్యతిరేకంగా సామాజిక సంప్రదాయ వాదిగా, అనుకూల - వ్యాపార, ఉచిత సంస్థ సంస్కరణలకు అనుకూలంగా ఉన్నారు. కాంగ్రెస్ నాయకత్వంలో ఎదిగిన దేశాయ్, అవినీతి వ్యతిరేక అంశాలతో తీవ్ర జాతీయవాదిగా, ప్రధానమంత్రి నెహ్రూ, అయన మిత్రపక్షాలను విభేదించారు. 1927-28 గోద్రాలో జరిగిన అల్లర్ల సమయంలో హిందువులపై మెతక వైఖరి అవలంభించాననే అపరాధ భావంతో మే1930న అతను గోద్రా డిప్యూటీ కలెక్టరు ఉద్యోగానికి రాజీనామా చేసారు. వివాదం లేకుండా ప్రజా జీవితంలో నాలుగు దశాబ్దాలు గడిపిన గొప్ప నాయకుడు. ప్రధాని పదవికి రాజీనామా చేసిన తరువాత, ఆయన ఎప్పుడూ క్రియాశీలక రాజకీయాల వైపు తిరిగి చూడలేదు. మొరార్జీ దేశాయ్ బొంబాయి రాజ్యంలో (ప్రస్తుతం గుజరాత్) బ్లస్టర్ జిల్లాకు చెందిన భడేలీ గ్రామంలో 1896 ఫిబ్రవరి 29 న బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. ముంబైలోని విల్సన్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ చేసిన తరువాత ఆయన గుజరాత్‌లో సివిల్ సర్వీసులో చేరారు. మహాత్మాగాంధీ అధ్వర్యంలో జరిగిన భారత స్వాతంత్ర్యోద్యమంలో చేరారు. భారత దేశంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్నారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో అనేక సంవత్సరాల పాటు జైలు శిక్ష అనుభవించారు. తన తెలివైన నాయకత్వ నైపుణ్యాల వల్ల స్వాతంత్ర్య సమర యోధులందరికీ అభిమాని అయ్యారు. గుజరాత్ ప్రాంతంలో భారత జాతీయ కాంగ్రెస్‌కు ముఖ్యమైన నాయకుడయ్యారు .1934, 1937 లలో ప్రాంతీయ ఎన్నికలు జరిగినప్పుడు, ఆయన బొంబాయి ప్రెసిడెన్సీలో వరుసగా రెవెన్యూమంత్రి, హోంమంత్రి బాధ్యతలను చేపట్టారు. 1952లో బొంబాయి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎన్నుకో బడ్డారు. బొంబాయి రాష్ట్రం ద్వి భాషా రాష్ట్రంగా ఉండేది. బొంబాయి రాష్ట్రంలో గుజరాత్, మరాఠీ భాషలు మాట్లాడే ప్రజలు ఉండేవారు. పార్లమెంటులో ఎనిమిది వార్షిక మరియు రెండు మధ్యంతర బడ్జెట్లను ప్రదర్శిస్తూ మొరార్జీ దేశాయ్ ఒక ప్రత్యేకమైన రికార్డును కలిగి ఉన్నారు. 1964, 1968 లో ఫిబ్రవరి 29 న రెండు కేంద్ర బడ్జెట్లను సమర్పించిన ఆర్థిక మంత్రిగా ఆయనకు ప్రత్యేకమైన ప్రత్యేకత ఉంది, ఇది అయన పుట్టినరోజు కావడం గమనార్హం. దేశాయ్ ఇందిరా గాంధీ ప్రభుత్వంలో ఉప ప్రధాన మంత్రిగా సేవల నందించారు. తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ప్రభుత్వంలో అనేక కీలక పదవులను చేపట్టారు. బొంబాయి రాష్ట్ర ముఖ్యమంత్రి, భారత హోం మంత్రి, ఆర్థిక మంత్రి, ప్రతిపక్ష నేత పదవులతొ పాటు భారతదేశ 2వ ఉపప్రధాని పదవిని కూడా చేపట్టారు. 1977 మార్చి 24వ తేది మొరార్జీ దేశాయి ప్రధానమంత్రి పదవీ బాధ్యతలు స్వీకరించారు. 1979 జూలై 26 వరకు భారత దేశానికి 4వ ప్రధానిగా తన సేవల నందించారు. భారత రాజకీయ చరిత్రలో 81 సంవత్సరాల వయసులో ప్రధాని పదవిలో ఉన్న నేత. అలాగే కాంగ్రేసేతర ప్రధానిగా పదవి చేపట్టి, 1979లో ప్రధాని పదవి నుంచి తప్పుకున్నారు. రెండున్నర సంవత్సరాలు (మార్చి 1977 నుండి జూలై 1979 వరకు) మాత్రమే ప్రధానిగా ఉన్నారు. దేశంలో తొలి కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఏర్పరచిన నేతగా చరిత్రలో మిగిలి పోయారు. అత్యధిక పౌర పురస్కారాలను అందుకున్న ఏకైక భారతీయుడిగా ఆయన గుర్తింపు పొందారు. పాకిస్తాన్ సంబంధిత అత్యున్నత పౌర పురస్కారం... నిషానే -ఎ - పాకిస్తాన్ - 1986లో గెలుచుకున్న ఏకైక భారతీయుడు. 1991లో భారత రత్న పురస్కారం పొందారు. అలా భారత దేశం, పాకిస్తాన్ దేశాల అత్యున్నత పౌర పురస్కారాలైన భారత రత్న, నిషానే పాకిస్తాన్ లను పొందిన ఏకైక భారతీయుడు మొరార్జీ. మొరార్జీ దేశాయ్ జనతాపార్టీకి 1980 సార్వత్రిక ఎన్నికలలో సీనియర్ రాజకీయ నాయకుడిగా ప్రచారం చేశారు, కాని ఎన్నికల్లో పోటీ చేయలేదు. అయన "యూరిన్ థెరపీ"ని అభ్యసించే వారు. 1978లో "మూత్ర చికిత్స" దీర్ఘకాలిక అభ్యాసకుడైన దేశాయ్ డేంరాథర్ తో "60 మినిట్స్" కార్యక్రమంలో మాట్లాడుతూ మూత్రం త్రాగడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. వైద్య చికిత్స పొందలేని లక్షల మంది భారతీయులకు మూత్ర చికిత్స అనేది పరిపూర్ణ వైద్య పరిష్కారం అని దేశాయ్ వివరించారు. స్వ మూత్రం తాగడం ద్వారా తన దీర్ఘాయువుని కాగలిగానని చెప్పారు. దీనిని





"జీవజలము" అని పిలిచారు. దేశాయ్ 1896 లో జన్మించారు. పదవీ విరమణ తరువాత అయన ముంబైలో నివసించి సంతోషంగా గడిపి, 1995 లో 99 సంవత్సరాల వయసులో మరణించారు. దేశాయ్ తన 100 వ పుట్టిన రోజుకు కొద్ది నెలల వ్యవధిలో 1995 ఏప్రిల్ 10 న కన్ను మూశారు. అత్యధిక కాలం జీవించిన దివంగత భారత ప్రధానిగా పేరు గడించారు. పాశ్చాత్య సాంప్రదాయం ప్రకారం పుట్టిన తేదీన జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్న ఆచారం. ప్రతి ఏడూ అలా పాశ్చాత్య సంస్కృతి ప్రభావాన పుట్టిన తేదీన భారత దేశంలోనూ జన్మదినం సందర్భంగా వేడుకలు జరుపుకోవడం సర్వసాధారణం. అయితే భారత దేశచరిత్రలో సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగి, వివిధ పదవులను అలంకరించి, దాదాపు శత సంవత్సరాలు జీవించిన ఒక గొప్పనాయకునికి అలాంటి అవకాశం లేకుండాపోయింది. అందుకే ఆ దివంగత గొప్ప నాయకుని జన్మదినం చాలా మందికి గుర్తుండదు. ఆయనే దివంగత భారత ప్రధాని మొరార్జీ దేశాయ్. కారణం ఆయన ఫిబ్రవరి 29వ తేదీన జన్మించడమే. లీపు సంవత్సరము అయితే తప్ప ఆయనది ప్రాతి సంవత్సర జన్మదినం కాకపోవడమే. నాలుగు ఏళ్లకు ఒకసారి మాత్రమే ఫిబ్రవరి 29 రావడం కావడమే. జన్మదిన ప్రత్యేకత లాగే పలు విధ ప్రత్యేకతల సమాహారం మొరార్జీ జీవితం. మొరార్జీ దేశాయ్ పండిన 99 ఏళ్ళ వయసు వరకు జీవించినా, ఫిబ్రవరి 29 న జన్మించినందున అయన తన జీవిత కాలంలో కేవలం 24 పుట్టిన రోజులను మాత్రమే చూసి, 25వది రావడానికి కొద్ది రోజుల ముందు కన్నుమూశారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
Jai Bheem TV STRUGGLE FOR JUSTICE సామాన్యుడి ఆయుధంగా

# వడదెబ్బకు గురి కాకుండా ప్రతిఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలి

**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య**

**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**



వేసవిలో వడదెబ్బకు గురికాకుండా ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల సరైన జాగ్రత్తలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య ప్రజలకు సూచించారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వేసవిలో వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ వేసవిలో ఉష్ణోగ్రతల వల్ల తలెత్తే అనారోగ్య సమస్యల గురించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆధ్వర్యంలో ఆరోగ్య శాఖ తరఫున జిల్లాలో 21వ తేదీన వైద్యాధికారులు, పల్లె దవాఖాన వైద్యులు, ఎంఎల్ హెచ్పీలతో జిల్లా స్థాయిలో సమావేశాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. వైద్యాధికారులు పని చేస్తున్న చోట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, వడదెబ్బకు గురికాకుండా నివారణ చర్యలు చేపట్టి తగిన చికిత్సకు సంబంధించిన విషయాలను కూడా వారికి అవగాహన కల్పించాల్సిందిగా సూచించడం జరిగిందన్నారు. జిల్లాలో ఉన్నటువంటి ఆరోగ్య సిబ్బందితో పాటు లైన్ డిపార్ట్మెంట్స్ అయినటువంటి అంగన్వాడీ, సెర్ప్ ఐకేపీ వారితో కూడా సమావేశాన్ని నిర్వహించి, ముఖ్యంగా గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు జరుగుతున్న ప్రదేశాలలో ఓఆర్ఎస్ పాకెట్లు అందించే విధంగా చేయడంతోపాటు షెడ్ నెట్ ద్వారా నీడ సౌకర్యాన్ని కల్పించాలని కోరినట్లు తెలిపారు. గ్రామాలలో ఆశా కార్యకర్తల ద్వారా ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయడం జరుగుతుందని, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 6 గంటలకు వివిధ పనుల నిమిత్తం వెళ్లి 11:30 లోపు ఇంటికి వస్తే బాగుంటుందని సూచించారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే తల పైన తెల్లటి రుమాలు, లేకపోతే క్యాప్ లాంటివి ధరించాలని, వదులుగా ఉన్న కాటన్ దుస్తులు ధరించాలని సూచించారు. తాగునీరు అధికంగా తీసుకోవాలని కోరారు. వడదెబ్బ తగలకుండా ఆరోగ్యం పట్ల ఇటువంటి జాగ్రత్తలు పాటించాల్సిందిగా ప్రజలకి సూచించారు. ప్రతి ప్రాథమిక కేంద్రాల్లో ఇంతకు ముందు నుండి కూడా కూలర్స్ పనిచేసేలా చూస్తున్నామని, వడదెబ్బ గురైన వారు చికిత్స కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే వారికి వైద్య చికిత్స అందిచడంతో పాటు టెంపరేచర్ తగ్గేటట్లు కూలర్ ను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. వడదెబ్బ కారణంగా ఎవరైనా మరణించినట్లయితే తహసీల్దార్, ఎస్సై, డాక్టర్లతో కూడిన త్రిసభ్య కమిటీ విచారించి నివేదిక ఇస్తారని అన్నారు. ఇచ్చిన నివేదిక ను కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపించడం జరుగుతుందన్నారు. వడదెబ్బకు గురైన వారికి తలనొప్పి, తీవ్రమైన జ్వరం, నాలుక ఎండిపోవటం, దాహం వేయడం, మగతా లేదా నిద్ర లాంటి స్థితి, వాంతులు, పూర్తి ఆపస్మారక స్థితిలో ఉండడంలాంటి లక్షణాలు ఉన్నవారిని వెంటనే చల్లని ప్రాంతానికి చేర్చాలని, చల్లని నీటిలో ముంచిన క్లాత్ లతో తూడవాలని సూచించారు. సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలించాలన్నారు. వేసవి కాలం దృష్ట్యా జిల్లాలో 3లక్షలకు పైగా ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. వడదెబ్బ బారీన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కాజీపేట మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్ మాట్లాడుతూ వరంగల్ మహా నగరపాలక సంస్థ కమిషనర్ ఆదేశాల మేరకు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నగరంలో పలు కార్యక్రమాలు నిర్వహిన్నస్తుట్లు తెలిపారు. గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ముఖ్యమైన 42 చోట్లలలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. నగర పాలక సంస్థ పరిధిలో పనిచేసే కార్మికులకు వేసవి దృష్ట్యా పనివేళల్లో మార్పు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ఎక్కువగా ఎండలో కార్మికులు పనిచేయకుండా ఉండేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఏడీ జి.వి. భానుప్రసాద్, ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఇక్తేదార్ అహ్మద్, జిల్లా మాస్ మీడియా అధికారి అశోక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్ నిర్మాణానికి స్థల పరిశీలన

**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**



వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పరిధిలో ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్ నిర్మాణానికి అనువైన స్థలం కోసం హనుమకొండ, కాజీపేట మండలాల పరిధిలోని పలు ప్రభుత్వ భూములను స్థానిక తహసిల్దార్లతో కలిసి హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్ బుధవారం పరిశీలించారు. హనుమకొండ మండలం పరిధిలోని సర్వే నంబర్ 23 , 27లతో పాటు కాజీపేట మండలం న్యూ శాయంపేట పరిధిలోని 23,135,389, 399,579 సర్వే నెంబర్ల లోని ప్రభుత్వ భూములను పరిశీలించారు. ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్ నిర్మాణానికి 15 ఎకరాల భూమి కావలసి ఉండగా అందుకు సరిపోను అనువైన స్థలం దొరకలేదని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో వెంట తహసిల్దారులు శ్రీపాల్ రెడ్డి, బావ్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో విద్యార్థులకు దుస్తులు కుట్టే మహిళా సమాఖ్య సభ్యులకు అవగాహన సదస్సు




**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

జిల్లా రెవెన్యూ అధికారి, (పిడి మెప్మా) పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వైవి గణేష్ ఆధ్వర్యంలో పట్టణ పరిధిలోని హన్మకొండ, కాజీపేట, పరకాల, హసన్ పర్తి మండలంలోని 141 పాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుట్టే మహిళా సమాఖ్య సభ్యులకు అవగాహన కార్యక్రమం బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి వైవి గణేష్ మాట్లాడుతూ పట్టణ పరిధిలో గల 141 పాఠశాలలో చదువుతున్న 12000 మంది విద్యార్థులకు సకాలంలో ఏకరూప దుస్తులు అందించాలని సూచించారు. ప్రతీ విద్యార్థి యొక్క కొలతలు తీసుకొని సిద్ధంగా ఉండాలని, నిర్దేశించిన నమూనాలో కుట్టి ఇవ్వాలని, నాణ్యమైన దారం గుండీలను ఉపయోగించాలని డబుల్ కుట్టు వేయాలని సూచించారు. ఒకటవ తరగతి నుంచి ఐదవ తరగతి అబ్బాయిలకు చొక్కా, నిక్కర్, ఆరవ తరగతి నుండి 12 వ తరగతి అబ్బాయిలకు చొక్కా ప్యాంట్ కుట్టాలనీ, 1వ తరగతి నుండి 3వ తరగతి చదువుతున్న అమ్మాయిలకు చొక్కా లాంగ్ ఫ్రాక్, 4వ, 5వ తరగతి చదువుతున్న అమ్మాయి లకు చొక్కా లంగా అదేవిధంగా 6 నుండి 12 తరగతి అమ్మాయిలకు పంజాబి డ్రస్ కుట్టాలని నిర్ణయించి నట్టు తెలిపారు. ఈ సంవత్సరం నుండి జత కు 75 రూపాయలు కేటాయించారని చెప్పారు. బట్ట రాగానే సీఓ లకు అందజేస్తామని తెలిపారు. 31 మే నాటికి పూర్తి స్థాయిలో కుట్టి పాఠశాలలకు అందచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ కో ఆర్డినేటర్ బద్దం సుదర్శన్ రెడ్డి మెప్మా జిల్లా భాద్యులు రజిత మండల విద్యాశాఖ అధికారులు మనోజ్, నెహ్రూ, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# టీజీ సెట్ 2025 నోటిఫికేషన్ తక్షణమే విడుదల చేయాలి

**పిడిఎస్.యు డిమాండ్**

**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

టీజీ సెట్ 2025 నోటిఫికేషన్ విడుదల చేయాలని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ను ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్ డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని అనేక మంది విద్యార్థులు టీజీ సెట్ 2025 నోటిఫికేషన్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు అని అన్నారు. సాధారణంగా ప్రతి సంవత్సరం తొలి త్రైమాసికంలో ఈ నోటిఫికేషన్ విడుదలవుతుండగా, ఈసారి అది ఆలస్యమవుతోంది, పీజీ సెట్ మెంబర్ సెక్రటరీ నరేష్ కుమార్ రెడ్డి ఇటీవల ఉస్మానియా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ గా నియమించబడ్డా నోటిఫికేషన్ విడుదలకు ఆలస్యం జరుగుతోందని అన్నారు. తెలంగాణలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాల కోసం సెట్ లేదా నెట్ అర్హత అవసరం. ప్రత్యేకంగా ఇంజనీరింగ్, డిగ్రీ, పీజీ కళాశాలలో బోధనకు సెట్ అర్హత ఉన్న అభ్యర్థులకు మెరుగైన అవకాశాలు లభిస్తున్నాయి. దీంతో, ఇటీవల పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులు టీజీ సెట్ 2025 నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారు. ఉన్నత విద్యా మండలి చైర్మన్ తక్షణ చర్యలు చేపట్టి నోటిఫికేషన్ త్వరగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఉడతా గణేష్ పిడిఎస్యు నాయకులు రమేష్. పవన్. కళ్యాణ్. తదితరులు పాల్గొన్నారు.



# ఆయుష్మాన్ ఆరోగ్యం మందిరాల ఆకస్మిక తనిఖీ

**వరంగల్ జిల్లా జై భీమ్ న్యూస్**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు ఆకస్మికంగా ఆయుష్మాన్ ఆరోగ్యం మందిరము తీగలవేణి సంగెం మండలంలో పర్యటించి వైద్యాధికారులను , వైద్య సిబ్బంది ప్రజలకు అందించవలసిన సేవల గురించి, సమయపాలన గురించి వివరించడం జరిగినది. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని మాతా శిశు సంరక్షణ, ప్రభుత్వ హాస్పిటల్ లో డెలివరీలు, వ్యాధి నిరోధక టీకాలు, అందించాలని కోరినారు. అనవసరమైన శస్త్రచికిత్సలు చేయకుండా సాధారణ ప్రసావాలు ప్రోత్సహించాలి అని సూచించారు. సంక్రమిత వ్యాధులు, అసంక్రమిత వ్యాధులు నిర్ధారణ పరీక్షలు చేయించి తగు చికిత్సలు అందించాలని, ప్రజలు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సూచనలు పాటిస్తూ ఆరోగ్యంగా ఉండడానికి ప్రయత్నం చేయాలని, ఏమైనా ఆరోగ్య సమస్యలు వచ్చినట్లయితే వెంటనే వైద్య సిబ్బంది ద్వారా తగు చికిత్సలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మరియు పల్లె దవఖానాలు ప్రజల ఆరోగ్య అవసరాలకు నిర్మించినారు. కాబట్టి సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలని కోరినారు. వైద్యాధికారులు, సిబ్బంది ప్రజలకు అందించవలసిన సేవల గురించి సిబ్బంది విధుల గురించి తగిన సూచనలు చేసారు. సమయపాలన పాటించని ఉద్యోగులపై చర్యలు ఉంటాయని తెలిపినారు. ఎండాకాలంలో వచ్చే ఆరోగ్య సమస్యలు నీళ్ల విరోచనాలు, బంక విరోచనాలు, అంటువ్యాధులు, వడదెబ్బ గురించి ప్రజలలో అవగాహన కల్పించాలని, ఎలాంటి వ్యాధులకు గురి అయిన వెంటనే వారికి తగిన చికిత్సలు అందించాలని కోరారు. ఎండాకాలంలో ప్రతి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలలో, ఆరోగ్య కేంద్రాలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఓఆర్ఎస్ కార్నర్ పెట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు స్థానిక పల్లె దవఖాన డాక్టర్లు, ఎల్డి కంప్యూటర్ నాగరాజు, వైద్య సిబ్బంది మొదలగు వారు పాల్గొన్నారు.



# మరణించిన పోలీస్ కుటుంబానికి భద్రత చెక్‌ను అందజేసిన సీపీ

**వరంగల్ జై భీమ్ క్రైమ్ న్యూస్**



వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణాలతో హాస్పటల్ లో చికిత్స పొందుతూ గత సంవత్సరం సెప్టెంబర్ 13వ తేదీన మరణించిన హెడ్ కానిస్టేబుల్ సదానందం కుటుంబానికి పోలీస్ భద్రత విభాగం మంజూరు చేసిన 7,89,920/- రూపాయల చెక్కును వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ చేతుల మీదుగా చెక్కును మరణించిన హెడ్ కానిస్టేబుల్ కుమారుడికి అందజేశారు. ప్రస్తుత మరణించిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబ స్థితిగతులపై పోలీస్ కమిషనర్ ఆరా తీశారు. ఈ కార్యక్రమం ఎ. ఓ రామకృష్ణ, సూపరింటెండెంట్ రామాదేవి పాల్గొన్నారు.

# చరిత్ర విభాగంలో భూక్య శారదకు డాక్టరేట్

**గిరిజన జాతిపై కేయూలో మొట్టమొదటి పరిశోధకురాలు రికార్డు నెలకొల్పారు**

**లంబాడా జాతి మూలాలపై పరిశోధన చేయడం అభినందనీయం**

**డాక్టరేట్ సాధించిన శారదను అభినందించిన విభాగ సిబ్బంది**

**కేయూ క్యాంపస్ జై భీమ్ న్యూస్:**



కాకతీయ విశ్వవిద్యాలయ చరిత్ర విభాగంలో పరిశోధకురాలు భూక్య శారద తండ్రి హరిలాల్ డాక్టరేట్ సాధించడం పట్ల గిరిజన సామాజిక వర్గానికి సంబంధించిన పలువురు మేధావులు ఆచార్యులు కుటుంబ సభ్యులు డాక్టర్ శారద సాధించిన ఘనత పట్ల అభినందనలు కురిపించారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో మొట్టమొదటిసారిగా గిరిజన జాతి పట్ల అంకితభావంతో పరిశోధనలు పూర్తి చేసి సోసియో ఎకనామిక్స్ కండిషన్స్ ఆఫ్ లంబాడీస్ ఇన్ తెలంగాణ డూరింగ్ ది ఏఎస్ఐఫ్ జహ (17 24 టు 1948) అనే ప్రధాన అంశానికి లోతైన పరిశోధనలు కొనసాగించి పూర్తి చేసి తితీస్ సమర్పించినందున కాకతీయ విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కట్ట రాజేందర్, భూక్య శారదకు డాక్టరేట్ ప్రధానం చేశారు. అసోసియేట్ ప్రొఫెసర్ పి.సదానందం పర్యవేక్షణలో భూక్య శారద తన పరిశోధనను పూర్తి చేశారు. ఈ సందర్భంగా డాక్టరేట్ సాధించిన భూక్య శారదను చరిత్ర విభాగానికి చెందిన ఆచార్యులు అధ్యాపకులు బోధన,బోధనేతర సిబ్బంది అభినందించారు. చరిత్ర విభాగంలో మొదటిసారి గిరిజన జాతికి అంకితం చేసే విధంగా చరిత్ర విభాగంలో తొలి డాక్టరేట్ సాధించిన డాక్టర్ భూక్య శారదను యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపల్ ,సోషల్ సైన్స్ డీన్ ఆచార్య తాళ్లపల్లి మనోహర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా గిరిజన పరిశోధకురాలు గిరిజన జాతిపై పరిశోధన కొనసాగించడాన్నీ కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ప్రతాపరెడ్డి రిజిస్ట్రార్ ఆచార్య ,రామచంద్రం , దూరవిద్య కేంద్రం సంచాలకులు ఆచార్య సురేష్ లాల్ ప్రత్యేకంగా అభినందించారు.

# హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలాన్ని నిలిపివేయాలి

**యూనివర్సిటీ భూముల పరిరక్షణ కోసం పోరాడుతున్న విద్యార్థులపై కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తున్న అణిచివేత చర్యలను వెంటనే నిలిపివేయాలి**

**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్**



**హైద్రాబాద్ జై భీమ్ న్యూస్**

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను పరిరక్షించాలంటూ డెమొక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం డిఎస్ఎ రాష్ట్ర కో కన్వీనర్ మున్నా గణేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్య వక్తలుగా జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ మారేడు వెంకట్ దాస్ లు పాల్గొని మాట్లాడుతూ 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో 369 మంది విద్యార్థుల త్యాగ ఫలితంగా ఏర్పడిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి ఆనాటి ఇందిరాగాంధీ ప్రభుత్వం 2324 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించిందని, పార్లమెంట్ చట్టం ప్రకారం అప్పటి రాష్ట్రపతి ఉత్తరువులో భాగంగా ఏర్పడిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి కేటాయించిన ఈ భూమిని కేవలం విద్యారంగ అభివృద్ధికి మాత్రమే ఉపయోగించాలన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ గతంలో హైదరాబాద్ పట్టణానికి దూరంగా ఉన్నదని కానీ, కాలం గడిచిన కొలది అది పట్టణ కేంద్రానికి మధ్యలోకి వచ్చిందని దానితో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములపై ప్రైవేటు పెట్టుబడిదారుల కన్ను పడిందని, అంతేకాకుండా నాటి ఆంధ్ర పాలకులు తెలంగాణ ప్రాంతంపై కొనసాగించిన వివక్ష అణిచివేత చర్యలలో భాగంగా 400ఎకరాల భూములను రకరకాల కంపెనీలు, సంస్థలకు గత ప్రభుత్వాలు అప్పనంగా అప్పగించాయన్నారు. అలాగే 2004 సంవత్సరంలో చంద్రబాబు ప్రభుత్వం ఐఎంజి భారత్ అనే ప్రైవేట్ కంపెనికి 400 ఎకరాల భూమిని కేటాయిస్తూ చేసుకున్న ఒప్పందాన్ని 2006 సంవత్సరంలో వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం రద్దు చేసిన తర్వాత ఆ ప్రైవేట్ సంస్థ ప్రభుత్వ నిర్ణయంపై హైకోర్టు, సుప్రీంకోర్టులలో సవాల్ చేసిందని, పై రెండు ఉన్నత న్యాయస్థానాలు ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థిస్తూ 2024 సంవత్సరంలో తీర్పునిచ్చాయి. తదనంతరం అట్టి కంచె గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిని టీజీఐఐసికు అప్పగించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం కంచె చేను మేసినట్లుగా యూనివర్సిటీ భూములను అభివృద్ధి చేస్తామని బుకాయిస్తున్నదని, విద్యారంగ అభివృద్ధి కోసం, భవిష్యత్ తరాల అవసరం కోసం యూనివర్సిటీ భూములను కాపాడవలసిన బాధ్యత కలిగిన ప్రభుత్వమే నేడు అందుకు విరుద్ధంగా ప్రైవేట్ కంపెనీలకు అప్పజెప్పడానికి పూనుకోవడం అన్యాయం, అక్రమమని రేవంత్ రెడ్డి ప్రభుత్వం యొక్క కపట నాటకాన్ని, మోసాన్ని బట్టబయలు చేసిన యూనివర్సిటీ విద్యార్థులపై అణిచివేత చర్యలకు పూనుకోవడాన్ని తెలంగాణ సమాజం సహించదని వారన్నారు. అలాగే ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ డెమొక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ శ్రవణ్, కో కన్వీనర్ గణేష్ లు మాట్లాడుతూ నాటి ఆంధ్రపాలకుల బాటలోనే నడుస్తున్న నేటి తెలంగాణ పాలకుల ఎత్తులను జిత్తులను తెలంగాణ ప్రజలు చిత్తు చేస్తారని, ఇప్పటికైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం అట్టి 400 ఎకరాల యూనివర్సిటీ భూములను వెంటనే తిరిగి యూనివర్సిటీకి అప్పగించాలని, అదేవిధంగా 1975 సంవత్సరంలో ఇందిరా గాంధీ ప్రభుత్వం కు కేటాయించిన 2324 ఎకరాల భూమిని సర్వే చేసి యూనివర్సిటీ పేరు మీద రిజిస్ట్రేషన్ చేసి హక్కులు దాఖలు పరచాలని డిమాండ్ చేసారు. అంతే కాకుండా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను రక్షించుకోవడానికి ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, బుద్ధి జీవులు, ప్రొఫెసర్లు, విద్యార్థులు, సామాజిక ప్రజా సంఘాలు, మహిళ సంఘాలు పెద్ద ఎత్తున కదిలి సంఘటిత పోరాటం చేయవలసిన అవసరం ఉందని, సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల పోరాటానికి మద్దతు ఇవ్వవలసిన అవసరం ఉందన్నారు. అలాగే ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు లింగారెడ్డి, లక్ష్మయ్య, మొయినుద్దీన్, ఓం బ్రహ్మం, విద్యార్థి సంఘాల నాయకులు నరసింహారావు, వడ్డేపల్లి మధు, సంతోష్, రాజేష్ నాగరాజు, స్టాలిన్, శివ, వెంకటేష్, శివ తదితరులు మాట్లాడారు.

# మంచు కుటుంబంలో ముదురుతున్న వివాదం

**జల్‌పల్లి నివాసం ముందు మనోజ్ బైఠాయింపు**

**ఉద్రిక్తతలు చోటు చేసుకోకుండా పోలీసుల మొహరింపు**

**ఆస్తి పంచాయితీ కాదంటున్న మంచు మనోజ్**

**హైదరాబాద్,ఏప్రిల్9(జై భీమ్ న్యూస్):**

నటుడు మోహన్‌బాబు కుటుంబం మరోమారు రోడ్డున పడింది. సొంత గొడవలతో పోలీస్ స్టేషన్ ఎక్కిన తనయులు తాజాగా మరో వివాదంతో ముందుకు వచ్చారు. ఇలా తాజాగా మరోసారి వార్తల్లో నిలిచింది. తన కారు పోయిందని పేర్కొంటూ మనోజ్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసి,ఇదంతా తన సోదరుడు విష్ణు చేయిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ క్రమంలోనే బుధవారం ఉదయం జల్‌పల్లి నివాసం వద్దకు చేరుకున్న మనోజ్.. గేటు బయట బైఠాయించి నిరసన తెలియజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. తమది ఆస్తి గొడవ కాదన్నారు. తన జుట్టు విష్ణు చేతుల్లోకి ఇచ్చేందుకు ఇలా చేస్తున్నారని ఆరోపించారు. నాకు ఈ ఆస్తి వద్దని నాన్నకు ఎప్పుడో చెప్పాను. ఇది ఆస్తి గొడవ కాదు. విద్యార్థుల భవిష్యత్తు కోసమే ఇదంతా. అక్కడే మొదలైంది ఈ గొడవ. డిసెంబర్ నుంచి గొడవలు జరుగుతున్నా పోలీసులు ఇప్పటివరకూ ఒక్క ఛార్జ్ షీట్ ఫైల్ చేయలేదు. కత్తులు, గన్‌లతో రౌడీలు మమ్మల్ని కొట్టడానికి వచ్చారు. దానికి సంబంధించిన సాక్ష్యాధారాలను పోలీసులకు ఇచ్చాను. ఇంట్లో నా పెంపుడు జంతువులు, ఇతర వస్తువులు ఉన్నాయి. వాటికోసమే వచ్చా అని మనోజ్ చెప్పారు. పాప పుట్టినరోజు కోసం మేం జయపుర వెళ్లిన తర్వాత విష్ణు ప్లాన్ చేసి ఇదంతా చేశారు. విష్ణు అనుచరులు ఇంటికి వచ్చి కార్లను తీసుకెళ్లారు. నా సెక్యూరిటీ-పై దాడి చేశారు. కమిషనర్ ఇచ్చిన బైండోవర్‌ను వాళ్లు ఎన్నోసార్లు దాటారు. నేను తప్పు చేశానని, ఆస్తి అడిగానని ఒక్క సాక్ష్యాధారం బయటపెట్టమనండి. అప్పుడు వాళ్లందరి కాళ్లపై పడి క్షమాపణ కోరతా. చోరీ గురించి పోలీసులకు చెబుతున్నా యాక్షన్ తీసుకోవడం లేదు. నా సెక్యూరిటీ- ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవట్లేదు. ఇప్పుడు నా ఇంట్లోకి వెళ్లడానికి ఆర్డర్ కావాలని పోలీసులు అడుగుతున్నారు. మోహన్‌బాబు చెబితేనే లోపలికి పంపిస్తానని అంటున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి నా విన్నపం ఒక్కటే. కోర్టు నోటీసులతో వచ్చినా లోపలకు పంపించడం లేదు. నా సమస్యను పరిష్కరించండని మనోజ్ విజ్ఞప్తి చేశారు. నా కుటుంబం నుంచి ఇప్పటివరకూ ఒక్క రూపాయి తీసుకోలేదు. బయట ప్రొడక్షన్‌లో హిట్ కొడితే తీసుకొచ్చి సొంత నిర్మాణ సంస్థలో సినిమా చేయాల్సిందేనని అనేవారు. విష్ణు కెరీర్ నిలబెట్టడం కోసం లేడీ గెటప్ కూడా వేశా. వాళ్ల కోసం ఎంతో గొడ్డు చాకిరీ చేశా. అయినా ఎందుకింతలా దిగజారుతున్నారో అర్థం కావడం లేదు. 'కన్నప్ప'కు పోటీ-గా 'భైరవం' విడుదల చేద్దాం అనుకున్నాం. టెన్షన్ పడిపోయి కన్నప్ప వాయిదా వేసుకున్నాడు. ఆ కోపాన్ని ఎలా తీర్చుకోవాలో తెలియక ఇదంతా చేస్తున్నాడు. ఇప్పుడు నా తల్లిదండ్రులకు ఈ తలనొప్పులు అవసరమా? విష్ణు ప్రశాంతంగా కూర్చొని మాట్లాడవచ్చు కదా అని మనోజ్ వ్యాఖ్యానించారు.కారు చోరీపై నార్సింగి పోలీసులకు సమాచారం ఇవ్వగా అది విష్ణు ఇంట్లో ఉన్నట్లు- గుర్తించారు. రికవరీకి వెళ్లినప్పుడు దాన్ని మాదాపూర్‌కు పంపించారని మనోజ్ మీడియాతో చెప్పారు. ఈక్రమంలోనే పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు చోటు-చేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

# కీలక వడ్డీరేట్లను సవరించిన ఆర్‌బిఐ

ముంబై : విశ్లేషకుల అంచనాలను నిజం చేస్తూ కీలక వడ్డీ రేట్లను ఆర్‌బీఐ మళ్లీ సవరించింది. వరుసగా రెండోసారి రెపో రేటును 0.25 శాతం మేర తగ్గించింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన కమిటీ నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా బుధవారం వెల్లడించారు. దీంతో రెపో రేటు 6.25 శాతం నుంచి 6 శాతానికి దిగొచ్చింది. ఈ ఏడాది ఫిబ్రవరిలోనూ కీలక వడ్డీరేట్లను కేంద్ర బ్యాంకు 25 బేసిస్ పాయింట్లు- తగ్గించిన సంగతి తెలిసిందే. ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. రెపో రేటుపై 25 బేసిస్ పాయింట్లు- తగ్గించినట్లు- ఆయన వెల్లడించారు. దీంతో గృహరుణాలపై వడ్డీ రేట్లు తగ్గే అవకాశాలు ఉన్నాయి. రెపోరేటును 6.25 శాతం నుంచి 6 శాతానికి తగ్గించినట్లు ఆర్బీఐ గవర్నర్ తెలిపారు. రెపో రేటు- తగ్గించడం వల్ల .. బ్యాంకులపై రుణభారం తగ్గనున్నది. దీని వల్ల బ్యాంకులు కూడా కస్టమర్లకు తక్కువ రేటుకే వడ్డీ ఇచ్చే అవకాశాలు ఉంటాయి. ఫలితంగా రుణాలపై ఈఎంఐలు తగ్గే ఛాన్సు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. రెపో రేటను 6 శాతానికి తగ్గించాలని ద్రవ్య పరపతి విధాన కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు- ఆర్బీఐ గవర్నర్ మల్హోత్రా తెలిపారు. తగ్గింపు నిర్ణయానికి మానిటరీ పాలసీ కమిటీ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపినట్లు ఆర్‌బీఐ గవర్నర్ వెల్లడించారు. ఈ సందర్భంగా స్థిర విధానం నుంచి సర్దుబాటు వైఖరికి మరాలని కమిటీ నిర్ణయించినట్లు తెలిపారు. వడ్డీరేటు తగ్గింపుతో గృహ, వాహన, ఇతర రుణాల వడ్డీరేట్లు తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుతం నెలకొన్న ఆర్థిక అనిశ్చితులు పెట్టుబడులు, వినిమయంపై ప్రతికూల ప్రభావం చూపించ నున్నాయి. ఫలితంగా వృద్ధి రేటు నెమ్మదించొచ్చని కూడా గవర్నర్ అభిప్రాయపడ్డారు. అధిక సుంకాలతో ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడనుంది. తయారీ రంగం పునరుద్ధరిస్తున్న సంకేతాలు కన్పిస్తున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు- 6.5శాతంగా నమోదయ్యే అవకాశాలున్నాయి. తొలి త్రైమాసికంలో 6.5శాతం, రెండో త్రైమాసికంలో 6.7శాతం జీడీపీ నమోదవ్వొచ్చని అంచనా. మూడు, నాలుగు త్రైమాసికాల్లో వృద్ధిరేటు వరుసగా 6.6శాతం, 6.3శాతం ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. ఆహార పదార్థాల ధరలు తగ్గుముఖం పడుతుండటంతో 2025-26 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం 4శాతానికి దిగి రావొచ్చని అంచనా. త్రైమాసికాల వారీగా 3.6శాతం, 3.9శాతం, 3.8శాతం, 4.4శాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి. ఏప్రిల్ 4వ తేదీ నాటికి విదేశీ నిల్వలు 676 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. వీటితో రాబోయే 11 నెలల వరకు దిగుమతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని అన్నారు. ఇకపోతే బంగారం తాకట్టు పెట్టి తీసుకునే రుణాలకు సంబంధించి నిబంధనలు కఠినతరం కానున్నాయి. దీనికి సంబంధించి మార్గదర్శకాలు జారీ చేస్తామని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకటించింది. దీంతో ముత్తూట్ ఫైనాన్స్, ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ వంటి రుణ జారీ సంస్థల షేర్లు భారీగా క్షీణించాయి. బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి రుణాలు తీసుకోవడం ఇటీవల విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో వీటిని అడ్డుకొనేందుకు ఆర్‌బీఐ చర్యలకు సిద్ధమవుతోందని కొన్నిరోజుల క్రితమే వార్తలు వచ్చాయి. దీనిపై ఆర్‌బీఐ తాజాగా స్పందించింది. వివిధ రకాల నియంత్రణ సంస్థలు అనుసరిస్తున్న మార్గదర్శకాలను సమన్వయం చేయడంతో పాటు, సాధ్యమైనంత వరకు రిస్క్ తగ్గించేందుకు త్వరలో సమగ్ర నిబంధనలతో మార్గదర్శకాలు జారీ చేస్తామని పేర్కొంది. ఎంపీసీ సమావేశ వివరాల వెల్లడి సందర్భంగా ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఈ వ్యాఖ్యలు చేశారు. ఆర్‌బీఐ ప్రకటనతో ముత్తూట్ ఫైనాన్స్ షేర్లు ఇంట్రాడేలో 10 శాతం మేర పతనం అయ్యాయి. బీఎస్‌ఈలో ఆ కంపెనీ షేర్లు రూ.2063కు చేరాయి. ఐఐఎఫ్ఎల్ షేర్లు సైతం 8 శాతం మేర క్షీణించాయి. మణప్పురం షేర్లు 3 శాతం, చోళమండలం షేర్లు 4.7 శాతం మేర పడ్డాయి. ముత్తూట్ ఫైనాన్స్ జారీ చేసే రుణాల్లో 98 శాతం వరకు బంగారం తాకట్టుగా పెట్టుకుని ఇచ్చేవే అధికం కావడంతో ఆ కంపెనీ షేర్లు ఎక్కువగా ప్రభావితం అయ్యాయి. మణప్పురం 50 శాతం, ఐఐఎఫ్ఎల్ 21 శాతం చొప్పున మొత్తం రుణాల్లో వాటాను కలిగిఉన్నాయి. రుణాల జారీ విషయంలో ఆర్థిక సంస్థలేవీ ఒకేతరహా విధానాలు పాటించడం లేదని ఆర్‌బీఐ గుర్తించింది. బంగారం తాకట్టు రుణాల జారీ నుంచి ఆ నగదు వినియోగం, వేలం వరకు ఇలా ప్రతి దానికీ విధివిధానాలను ఖరారు చేసే అవకాశం ఉంది.

## అరెస్టు చేసిన యూనివర్సిటీ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను తక్షణమే విడుదల చేయాలి

**కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్ కోఆర్డినేషన్ కమిటీ డిమాండ్**





**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

రాష్ట్రంలో వివిధ యూనివర్సిటీలలో పనిచేస్తున్న 1270 మంది కాంట్రాక్ట అధ్యాపకులను క్రమబద్ధీకరించిన తర్వాతనే యూనివర్సిటీలలో కొత్త రిక్రూట్మెంట్ చేపట్టాలని, అదేవిధంగా ఇటీవల తీసుకొచ్చిన జీవో నెంబర్ 21 రద్దు చేయాలని నేడు డిమాండ్ చేస్తూ ఉన్నత విద్యా మండలి కార్యాలయం దగ్గర నిరసన వ్యక్తం చేస్తున్న అనేకమంది కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను పోలీసులు అరెస్టు చేయడాన్ని కాకతీయ యూనివర్సిటీ కోఆర్డినేషన్ కమిటీ నేతలు తీవ్రంగా ఖండిస్తున్నారు. అదేవిధంగా కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొసెస్ ను బుధవారం తెల్లవారు జామున నుండి 40 మందికి పైగా అధ్యాపకులను అక్రమంగా అరెస్టు చేసి వారి కుటుంబాలను తీవ్ర మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఈ చర్యలను కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ తీవ్రంగా ఖండిస్తున్నారు. అనేక సంవత్సరాలుగా యూనివర్సిటీలలో యూనివర్సిటీ అభివృద్ధి కోసం పనిచేస్తున్న కాంట్రాక్ట్ ప్రొఫెసర్లు తమ న్యాయమైన డిమాండ్ ను కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగానే అమలు చేయమని కోరితే ప్రజా పాలనలో అది నేరంగా మారుతుందని ఈ సందర్భంగా ప్రశ్నించారు. అరెస్టు చేసిన అధ్యాపకులను తక్షిణమే విడుదల చేయాలని కేయూ కాంట్రాక్టు కోఆర్డినేషన్ కమిటీ నేతలు డా. సాదు రాజేష్, డా. మాదాసి కనకయ్య, డా. బి సతీష్ తదితరులు డిమాండ్ చేశారు.

## ఉస్మానియా అరుణతార కామ్రేడ్ జార్జిరెడ్డి స్ఫూర్తి కొనసాగిద్దాం

**పి.డి.ఎస్.యు జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రంజిత్ కుమార్**




**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

ఈరోజు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం కాకతీయ డిగ్రీ కళాశాల కార్యవర్గం ఆధ్వర్యంలో కాకతీయ డిగ్రీ కళాశాలలో జార్జి రెడ్డి 53వ వర్ధంతి సభల వాల్ పోస్టర్ ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రంజిత్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ ఉస్మానియా అరుణతార కామ్రేడ్ జార్జి రెడ్డి అమరత్వాన్ని గుర్తు చేసుకుంటూ జిల్లాలో జార్జి రెడ్డి వర్ధంతి సభలను విజయవంతం చేయాలని కోరారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మతోన్మాద ఆర్ఎస్ఎస్ బిజెపి గుండాల చేతిలో జార్జి రెడ్డి అత్యంత దారుణంగా హత్య చేయబడిన జార్జ్ స్ఫూర్తి ఇంకా విద్యార్థులలో కొనసాగుతూనే ఉందని పేద బలహీన వర్గాల విద్య కోసం జార్జి రెడ్డి చేసిన పోరాటం నేటి యువతకు ఆదర్శమని అన్నారు, విద్యార్థులు జార్జి రెడ్డిని ఆదర్శంగా తీసుకొని సమాజంలో జరుగుతున్న సమస్యల పైన పోరాడాలని వారికి పిలుపునిచ్చారు మతోన్మాద ఆర్ఎస్ఎస్ ఏబీవీపీ విద్యార్థుల మధ్య కులాలను మతాలను తీసుకొని వచ్చి విద్యార్థుల మధ్య ఘర్షణ వాతావరణాన్ని సృష్టించే కుట్రలు చేస్తుందని ప్రభుత్వ పాఠశాలను కళాశాలలను యూనివర్సిటీలను బిజెపి ఫాసిస్ట్ ప్రభుత్వం బలహీనపరుస్తుందని వారు తెలిపారు విద్యార్థులు మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని జార్జి రెడ్డి వర్ధంతి సభలను విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు తేజ, కిషోర్, రమ్య, రాజు, రఘు, వెంకట్, దీపిక తదితరులు పాల్గొన్నారు.

జై భీమ్
POWER OF PEOPLE

# హెచ్‌డీఎఫ్‌సీ ఖాతాదారులకు అలర్ట్..
# 12న బ్యాంకు సేవలలో అంతరాయం!




హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఖాతాదారులకు అలర్ట్! 12వ తేదీన బ్యాంకు సేవలలో కొంత అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది. అందుకే వినియోగదారులు ముందుస్తుగా గమనించడం చాలా ముఖ్యం. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తన ప్లాట్‌ఫారమ్‌ల నిర్వహణలో భాగంగా, కొన్ని బ్యాంకింగ్ సేవల్లో అంతరాయం ఏర్పడవచ్చు. ఏప్రిల్ 2వ తేదీన ఉదయం 2.30 గంటల నుంచి ఉదయం 6.30 గంటల వరకు (4 గంటలు) పలు సేవల్లో అంతరాయం ఏర్పడనుందని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు తెలిపింది. ఈ బ్యాంకు సిస్టమ్ నిర్వహణలో భాగంగా ఏర్పడే అంతరాయాల్లో చాట్‌బ్యాంకింగ్, ఎస్ఎంఎస్ బ్యాంకింగ్, ఫోన్‌బ్యాంకింగ్ ఐవీఆర్ సేవల్లో అంతరాయం ఉండవచ్చు. బ్యాంక్ తన కోర్ బ్యాంకింగ్ సిస్టమ్‌ను కొత్త ప్లాట్‌ఫామ్‌కు అప్‌గ్రేడ్ చేస్తోంది. దాని 93 మిలియన్ల వినియోగదారులకు కస్టమర్ అనుభవాన్ని మెరుగుపరచడం క్ష్యంగా పెట్టుకుంది. దీంతో బ్యాంకు వినియోగదారులను మెయిల్స్, సందేశాన్ని కూడా పంపినట్లు తెలిపింది. సిస్టమ్ అప్‌గ్రేడ్ చేస్తున్నందున బ్యాంకు అకౌంట్‌కు సంబంధించి యూపీఐ సేవలతో పాటు ఇతర సేవలు అందుబాటులో ఉండవని తెలిపింది.

# ముడి చమురు తగ్గింపు లాభాన్ని కాజేస్తున్న కేంద్రం



అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు అమాంతం పడిపోయాయి. గతేడాది 2024 నుంచి తగ్గుముఖం పట్టిన చమురు ధరలు ఇటీవల మరింత దిగివచ్చాయి. 2025 ప్రారంభంలో బ్యారెల్ 70 డాలర్ల దిగువకు పడిపోయింది. తాజాగా వాణిజ్య యుద్ధం ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్లో సోమవారం బ్రెంట్ క్రూడ్ ఆయిల్ బ్యారల్ ధర 64 డాలర్లకు క్షీణించింది. అటు టెక్సాస్ క్రూడ్ ధర 60 డాలర్లకు దిగొచ్చింది. ఇది నాలుగేళ్ల కనిష్ట స్థాయి కావడం విశేషం. వాణిజ్య యుద్ధం ఇతర పరిణామాలతో రష్యా ఉరల్స్ ఆయిల్ ధర ఏకంగా 50 డాలర్లకు క్షీణించింది. అయితే ఈ తగ్గింపు కారణంగా రిటైల్ మార్కెట్‌లో పెట్రోలు, డీజిలు ధరలు తగ్గుతాయని ఆశించిన వినియోగదారులను కేంద్ర ప్రభుత్వం నిలువునా వంచనకు గురిచేస్తోంది. ఎక్సైజ్ డ్యూటీలు అదనంగా పెంచేసి తగ్గింపు లాభాలు ప్రజలకు చేరనీయకుండా దొడ్డిదారిన దోచుకుంటోందన్న విమర్శలు వస్తున్నాయి. దీంతో ప్రజలపై ఎప్పటిలానే ధరాభారం పెరిగిపోతోంది. డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య యుద్ధం ఒత్తిడి, అమెరికాలో పెరుగుతున్న మాంద్యం భయాలు, ప్రపంచ మార్కెట్‌లో డిమాండ్ లేకపోవడం ఇవన్నీ చమురు ధరలు పడిపోవడానికి ప్రధాన కారణమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఒపెక్ దేశాలు ఉత్పత్తి అంచనాలకు కోత పెట్టాయి. ఇది బలహీనమైన ప్రపంచ వినియోగాన్ని ప్రతిబింబిస్తుంది. మరోవైపు చైనా వంటి మార్కెట్లలో ఎలక్ట్రిక్ వాహనాల వాడకం పెరగడం క్రూడ్ ధరలు మరింత తగ్గేలా చేశాయి. వారంలో రెండుసార్లు చమురు ధరల అంచనాలను తగ్గించిన బ్రోకరేజ్ సంస్థ గోల్డ్‌మన్ సాచ్స్ మంగళవారం మరింత కోత పెట్టింది. బ్యారెల్ ధర 40 డాలర్లకు పడిపోయినా ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదని విశ్లేషించింది. గ్లోబల్ మార్కెట్‌లో చమురు ధరలు అమాంతం తగ్గుతుంటే దేశీయంగా మోడీ సర్కార్ ఎప్పటిలాగే తన ఖజానాను నింపుకునే పనిలో ఉంది. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైస్ సుంకాన్ని లీటర్‌కు రూ.2 చొప్పున పెంచుతూ సోమవారం నిర్ణయం తీసుకుంది. ఈ మొత్తాన్ని ఇంధన కంపెనీలు భరించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. తాజా పెంపు తర్వాత లీటర్ పెట్రోల్‌పై రూ.13, డీజిల్‌పై రూ.10 ఎక్సైస్ సుంకం అమల్లోకి రానుంది. 2014 నుంచి 2016 మధ్య మోడీ సర్కార్ ఇంధనాలపై 9 సార్లు ఎక్సైస్ సుంకాన్ని పెంచింది. దీంతో ఆ సమయంలో కేంద్రానికి రూ.99,000 కోట్ల ఆదాయం సమకూరింది. అంటే ఆ మొత్తం ప్రజలపై భారం పడింది. ప్రపంచ మార్కెట్‌లో చమురు ధరలు తగ్గినప్పుడల్లా ఆ ప్రతిఫలాలను ప్రజలకు అందకుండా బిజెపి సర్కార్ ఎక్సైస్ సుంకాన్ని బాదుతోందనే విమర్శలు ఉన్నాయి.






# వెంటాడుతున్న ట్రంప్ సుంకాల భయాలు..

### నష్టాల్లో స్టాక్ మార్కెట్స్!

అమెరికా, చైనా మధ్య టారిఫ్ యుద్ధం మరోసారి ప్రపంచవ్యాప్తంగా మార్కెట్లలో ప్రకంపనలు సృష్టించింది. భారతదేశంలోని మార్కెట్, పెట్టుబడిదారులు ఈరోజు ఆర్‌బిఐ నిర్ణయం కోసం చూస్తున్న తరుణంలో చైనాపై 104 శాతం సుంకం ప్రకటన మరోసారి మార్కెట్లో ప్రకంపనలు సృష్టించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనాపై విధించిన సుంకానికి ప్రతీకారంగా, చైనా అమెరికాపై 34% సుంకాన్ని విధించింది. ఏప్రిల్ 8 నాటికి దానిని ఉపసంహరించుకోవాలని ట్రంప్ కోరినప్పటికీ, చైనా దానికి అంగీకరించలేదు. ఇప్పుడు అమెరికా చైనా నుండి దిగుమతి చేసుకునే వస్తువులపై 104% సుంకం విధిస్తున్నట్లు ప్రకటించింది. చైనాపై సుంకాల ప్రభావం నేడు భారత మార్కెట్‌పై కూడా కనిపిస్తోంది. బుధవారం సెన్సెక్స్ 445.67 పాయింట్ల నష్టంతో 73,781 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 162 పాయింట్లు కుంగి 22,373 వద్ద కదలాడుతోంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 21 పైసలు తగ్గి, 86.45 వద్ద ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తొలి ద్వైమాసిక పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నరు సంజయ్ మల్హోత్రా వెల్లడించనున్నారు. కీలక రేట్లను 0.25% మేర తగ్గించే అవకాశం ఉంది. మరోవైపు, బీజింగ్ నుంచి వచ్చే దిగుమతులపై అమెరికా ఏకంగా 104శాతం టారిఫ్‌లు ప్రకటించిన సంగతి తెలిసిందే. అమెరికా కాలమానం ప్రకారం ఏప్రిల్ 9 నుంచి ఈ సుంకాలు అమల్లోకి రానున్నాయి. చైనాపై చర్య తీసుకున్న తర్వాత అమెరికా త్వరలో ఔషధ ఉత్పత్తులపై భారీ సుంకాలను విధించబోతోందని ట్రంప్ అన్నారు. ఇప్పటివరకు ఫార్మా రంగాన్ని అమెరికా పరస్పర సుంకం విధానం నుండి మినహాయించారు. కానీ ఇప్పుడు ఈ విధానం పరిధిని విస్తరించవచ్చు. అమెరికాకు ఔషధాలను సరఫరా చేసే అతిపెద్ద దేశం భారతదేశం. ట్రంప్ నిర్ణయం భారత ఫార్మా కంపెనీలపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుంది. సన్ ఫార్మా, లుపిన్, డాక్టర్ రెడ్డీస్, అరబిందో ఫార్మా, గ్లాండ్ ఫార్మా వంటి కంపెనీలు అమెరికా మార్కెట్‌పై ఎక్కువగా ఆధారపడి ఉన్నాయి. బుధవారం వాటి షేర్లు ఒత్తిడిలో కనిపించాయి. మంగళవారం అమెరికా స్టాక్ మార్కెట్ వరుసగా నాలుగో రోజు పడిపోయింది. దాదాపు ఒక సంవత్సరంలో మొదటిసారిగా ూఢూ 500 5,000 కంటే తక్కువగా ముగిసింది. ఫిబ్రవరి 19న నమోదైన రికార్డు స్థాయి నుండి ఇప్పుడు ఇండెక్స్ 18.9% తగ్గింది. ఇది మాంద్యాన్ని సూచించే 20% క్షీణతకు దగ్గరగా ఉంది. అదే సమయంలో డౌ జోన్స్ పారిశ్రామిక సగటు 320 పాయింట్లు తగ్గి 37,645.59 వద్ద ముగిసింది. ఎస్ అండ్ పి 500 1.57% తగ్గి 4,982.77 వద్ద ముగిసింది.

# భారతదేశంలో క్రిప్టో నిబంధనలు..

### 2025లో పెట్టుబడిదారులు తెలుసుకోవలసినవి!

ఆధునిక ఆర్థికవిధానంలో ఉన్న చిక్కుల్లో.. ఒకప్పుడు సముద్ర వాణిజ్యం ఉన్నట్లు ఇప్పుడు క్రిప్టో ఆస్తులు ఉన్నాయి. ఇందులో అవకాశం, ప్రమాదం రెండూ ఉంటాయి. ప్రతి విషయంలో అభివృద్ధి ఉన్నట్లే మన దేశంలోని క్రిప్టో రెగ్యులేటరీ విధానం ప్రస్తుతం అన్వేషణ దశలో ఉంది. 2025 వచ్చేసింది. ఈ విధానం దేశ నాయకులతో పాటు.. ఇందులో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలనే ప్రతి మదుపుదారు, వ్యాపారి దృష్టిసారించాలని భావిస్తున్నారు. క్రిప్టోపై భారత్ వైఖరి నిర్మాణాత్మక వివేకంతో కూడుకున్నది. అవసరమైనప్పుడు వ్యవహరించే ధోరణితో 'వేచి చూసే' విధానాన్ని ఈ దేశం అవలంబిస్తోంది. అయితే క్రిప్టో, వర్చువల్ డిజిటల్ ఆస్తులను (వీడీఏ) ప్రస్తుత ట్యాక్స్ అండ్ కాంప్లయన్స్ ఫ్యాబ్రిక్‌లో కొంత మేరకు కేంద్రం పొందుపరిచిందని, ఒక ప్రత్యేకమైన వాతావరణాన్ని రూపొందిస్తోంది. దీనిపై అవగాహన కలిగేందుకు దోహదపడుతుందని జియోటస్ క్రిప్టో ప్లాట్‌ఫామ్ సీఈవో విక్రమ్ సుబ్బురాజ్ అన్నారు. వీడీఏల నుంచి వచ్చే లాభాలపై భారత్ 30 శాతం పన్ను విధిస్తోంది. దీనికి హెూల్డింగ్ పీరియడ్ లేదా ట్రేడింగ్ స్కేల్ తో సంబంధం లేదు. నష్టాలను పూడ్చుకోవడానికి ఈ పన్ను విధానంలో వీలుండదు. ఇది మార్కెట్ లో పాల్గొనే ప్రతి ఒక్కరికీ రిస్క్ మేనేజ్ మెంట్ ను ఒక ముఖ్యమైన నైపుణ్యంగా చేస్తుంది. లావాదేవీలపై మూలం వద్ద 1% పన్ను మినహాయింపు (టీడీఎస్) వర్తిస్తుంది. దీన్ని సులభంగా గుర్తించాలి. ఇతరత్రా వ్యాపారాల తరహాలో దాచిపెట్టలేరు. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను క్రిస్టలైజ్ చేయడం అనేది ఓ కొత్త విషయం. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఎఫ్ఐయూ)లో రిజిస్టర్ అయిన ఎక్స్ఛేంజీలు నో యువర్ కస్టమర్ (కేవైసీ), యాంటీ మనీ లాండరింగ్ (ఏఎంఎల్) ప్రోటోకాల్స్ లాంటివాటిని సంప్రదాయ ఆర్థిక సంస్థల్లాగే కఠినంగా పాటించాలి. ఇది పెట్టుబడిదారులకు మరింత రక్షణ, సంస్థాగత చట్టబద్ధతకు వేదికను కల్పిస్తుంది. క్రిప్టో ఊహాజనిత కొత్తదనం స్థాయి నుంచి విశ్వసనీయ ఆస్తి వరకు అభివృద్ధి చెందడానికి ఇది అవసరం. నిబంధనలను సాధారణంగా ఒంటరిగా రూపొందించరు. భారతదేశ విధాన దిశ అంతర్జాతీయ చర్చకు అద్దం పడుతోంది. స్థిరమైన, వికేంద్రీకృత ఫైనాన్స్ (డీఫై) కోసం మరింత నిర్వచించిన నిబంధనల దిశగా అమెరికా అడుగులు వేస్తోంది. ఈయూ మార్కెట్స్ ఇన్ క్రిప్టో ఎసెట్స్ (ఎంఐసీఏ) ఫ్రేం వర్క్ ఇప్పటికే సిద్ధమవుతోంది. ఆఫ్ షోర్ ఎక్స్ఛేంజీలు, వాలెట్లపై ఇటీవల భారతదేశం తీసుకున్న అణచివేత చర్యలు.. ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) ట్రావెల్ రూల్, గ్లోబల్ ఏఎంఎల్ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయి. 2025లో భారత్ 'మల్టీ ఏజెన్సీ ఓవర్ సైట్ ఫ్రేం వర్క్'ను అధికారికంగా ప్రకటించడం ఒక ముఖ్యమైన పరిణామం. సెక్యూరిటీలను పోలిన టోకెన్ల కోసం సెబీబీ పేమెంట్ టోకెన్ల కోసం ఆర్బీఐబీ లేదా బ్లాక్ చెయిన్ టెక్నాలజీ వాడకం కేసుల కోసం మెయిటీ ఉన్నాయి. పెట్టుబడిదారులకు ఇదంతా చూస్తే మొదట్లో చాలా గందరగోళంగా అనిపించవచ్చు. కానీ, ఇది అస్పష్టతను కచ్చితంగా తొలగించి, బాధ్యతాయుతమైన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుంది.



# ఆర్బీఐ ఎంపీసీ సమావేశంలో కీలక నిర్ణయం..

### కోట్లాది మందికి ఉపశమనం!




దేశ బ్యాంకింగ్ నియంత్రణ సంస్థ, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్య విధాన కమిటీ దేశంలోని కోట్లాది మందికి రుణ ఈఎంఐలలో ఉపశమనం కల్పించింది. ఆర్బీఐ వీూజ వరుసగా రెండవసారి రెపో రేటును 0.25 శాతం తగ్గించింది. ఆ తర్వాత రెపో రేటు 6.25 శాతం నుంచి 6 శాతానికి తగ్గింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలతో ఇబ్బంది పడుతున్న సమయంలో ఆర్‌బిఐ నుండి ఈ నిర్ణయం వచ్చింది. దీని తర్వాత ప్రపంచంలో ద్రవ్యోల్బణం, మాంద్యం పెరిగే అవకాశం పెరిగింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి వెళ్లే అవకాశాన్ని పరిగణనలోకి తీసుకుంటే, ఆర్‌బిఐ తీసుకున్న ఈ నిర్ణయం చాలా మెరుగైనదిగా ఉంది. ఆర్బీఐ ఎంపీసీలోని మెజారిటీ సభ్యులు 0.25 శాతం కోతను సిఫార్సు చేశారు. ఆ తర్వాత రెపో రేటును ఇంత తగ్గించాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రత్యేకత ఏమిటంటే ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వరుసగా రెండోసారి ఆర్‌బిఐ పాలసీ రేటును తగ్గించారు. ఫిబ్రవరి నెలలో జరిగిన పాలసీ సమావేశంలో కూడా వడ్డీ రేట్లను 0.25 శాతం తగ్గించారు. ఈ తగ్గింపు దాదాపు 5 సంవత్సరాల తర్వాత అంటే 56 నెలల తర్వాత కనిపించింది. ఈ తగ్గింపు తర్వాత సామాన్య ప్రజలకు పెద్ద ఉపశమనం లభిస్తుందని భావిస్తున్నారు. బ్యాంకింగ్ రంగంలో గృహ రుణాలు, కారు రుణాలు, రిటైల్ రుణాల ఖర్చు తగ్గుతుంది. దీని నుండి రియల్ రంగం ఎంతో ప్రయోజనం పొందుతారు. గత కొన్ని నెలలుగా మాంద్యం ఎదుర్కొంటున్న ఈ రంగంలో ఇళ్లకు డిమాండ్ పెరగవచ్చు. మార్చి నెల ద్రవ్యోల్బణ గణాంకాలు వెల్లడి కానప్పటికీ, ఫిబ్రవరి నెలలో దేశ ద్రవ్యోల్బణం 4 శాతం కంటే తక్కువగా ఉంది. గణాంకాలను పరిశీలిస్తే, దేశ రిటైల్ ద్రవ్యోల్బణం 3.6 శాతంగా ఉంది. ఇది 7 నెలల్లో కనిష్ట స్థాయికి చేరుకుంది. దీనికి ప్రధాన కారణం ఆహార ద్రవ్యోల్బణం తగ్గడమేనని చెబుతున్నారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఏప్రిల్ నెలలో కూడా రిటైల్ ద్రవ్యోల్బణం 4 శాతం కంటే తక్కువగా ఉండవచ్చు. రాబోయే రోజుల్లో ఈ సమస్య తప్పదు. దానికి ఒక కారణం ఉంది. ఈసారి వేడి మరింత తీవ్రంగా ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. దీనివల్ల పంటలపై ప్రభావం చూపుతుంది. దీని కారణంగా కూరగాయలు, ధాన్యాల ధరలు పెరిగే అవకాశం ఉంది. దీని ప్రభావం ఆహార ద్రవ్యోల్బణంపై కనిపిస్తుంది. రెండవది ట్రంప్ సుంకం కారణంగా రూపాయి తగ్గవచ్చు. అలాగే ద్రవ్యోల్బణం కారణంగా దిగుమతి ద్రవ్యోల్బణం పెరగవచ్చు. ంఆర్‌బిఐ అంచనా ప్రకారం.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం 4.8 శాతంగా ఉంటుందని అంచనా. అయితే నాల్గవ త్రైమాసికంలో ద్రవ్యోల్బణం 10 బేసిస్ పాయింట్లు పెరిగింది. ఇది మునుపటి 4.4 శాతం నుండి 4.5 శాతానికి పెరిగింది. అదే సమయంలో 2026 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం 4.2 శాతంగా అంచనా వేయబడింది. అయితే మొదటి త్రైమాసికంలో ఇది 4.6 శాతం వద్ద ఉండవచ్చు. గతంలో ఇది 4.5 శాతంగా ఉంటుందని అంచనా. రెండవ త్రైమాసికంలో ఇది 4 శాతం, మూడవ త్రైమాసికంలో 3.8 శాతం, నాల్గవ త్రైమాసికంలో 4.2 శాతంగా ఉంటుందని అంచనా.

# మాక్స్‌వెల్‌కు షాకిచ్చిన బీసీసీఐ

## 25 శాతం ఫైన్!



ఐపీఎల్ 2025లో భాగంగా మంగళవారం పంజాబ్ కింగ్స్- చెన్నై సూపర్ కింగ్స్ మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌ను పంజాబ్ కింగ్స్ 18 పరుగుల తేడాతో గెలుచుకుంది. 2 పాయింట్లు సాధించి ప్లేఆఫ్‌లకు తమ ఆశలను బలపరిచింది. అయితే మ్యాచ్ తర్వాత పంజాబ్ స్టార్ ఆటగాడు గ్లెన్ మాక్స్‌వెల్‌పై జరిమానా విధించబడింది. బీసీసీఐ అతనిపై కఠిన చర్యలు తీసుకుంది. ఐపీఎల్ నిబంధనలను ఉల్లంఘించినందుకు గ్లెన్ మాక్స్‌వెల్‌పై అతని మ్యాచ్ ఫీజులో 25 శాతం జరిమానా విధించబడింది. ఈ నిర్ణయం బీసీసీఐ తీసుకుంది. అంతేకాకుండా నియమాలను ఉల్లంఘించినందుకు మాక్స్‌వెల్‌కు ఒక డిమెరిట్ పాయింట్ కూడా లభించింది. ఐపీఎల్ మీడియా విడుదలలో తెలిపిన వివరాల ప్రకారం.. గ్లెన్ మాక్స్‌వెల్ ఆర్టికల్ 2.2 (మ్యాచ్ సమయంలో ఫిక్స్‌చర్‌లు, ఫిట్టింగ్‌ల దుర్వినియోగం) కింద లెవెల్ 1 నేరాన్ని అంగీకరించాడు. మ్యాచ్ రిఫరీ శిక్షను కూడా అంగీకరించాడు. నిబంధనల ప్రకారం.. లెవెల్ 1 ఉల్లంఘనల కోసం మ్యాచ్ రిఫరీ నిర్ణయం తీసుకుంటారు. గ్లెన్ మాక్స్‌వెల్ ఐపీఎల్ 2025లో ఇప్పటివరకు పెద్దగా ఆకట్టుకోలేకపోయాడు. పంజాబ్ అతన్ని ఎన్నో ఆశలతో తమ జట్టులో చేర్చుకుంది. కానీ ఈ ఆస్ట్రేలియన్ స్టార్ ఆ ఆశలను నెరవేర్చలేకపోయాడు. ఇప్పటివరకు ఆడిన 4 మ్యాచ్‌లలో అతను విఫలమయ్యాడు. 4 మ్యాచ్‌లలో 3 ఇన్నింగ్స్‌లలో అతను 31 పరుగులు మాత్రమే చేశాడు. అంతేకాకుండా 4 మ్యాచ్‌లలో అతను 3 వికెట్లు తీశాడు. రాబోయే మ్యాచ్‌లలో పంజాబ్‌కు మాక్సీ నుండి ఎన్నో ఆశలు ఉండబోతున్నాయి. చెన్నైతో జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్ 20 ఓవర్లలో 219 పరుగులు చేసింది. పంజాబ్ తరపున ప్రియాంష్ ఆర్య 42 బంతుల్లో 103 పరుగుల ఇన్నింగ్స్ ఆడాడు. అతనితో పాటు శశాంక్ సింగ్ 36 బంతుల్లో 52 పరుగులు చేశాడు.

## సమరోత్సాహంతో గుజరాత్





వరుస విజయాలతో జోరుమీదున్న గుజరాత్ టైటాన్స్ బుధవారం రాజస్థాన్ రాయల్స్‌తో జరిగే పోరుకు సమరోత్సాహంతో సిద్ధమైంది. ఇప్పటికే మూడు విజయాలు సాధించి జోరుమీదున్న ఈసారి అదే సంప్రదాయా న్ని కొనసాగించాలనే పట్టుదలతో ఉంది. ఇక కిందటి మ్యాచ్‌లో పటిష్టమైన పంజాబ్‌పై ఘన విజయం సాధించిన రాజస్థాన్ కూడా ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతోంది. సంజు శాంసన్ మళ్లీ కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టడంతో రాజస్థాన్ బలోపేతంగా తయారైంది. రియాన్ పరాగ్ పేలవమైన కెప్టెన్సీ వల్ల ఆరంభ మ్యాచుల్లో రాజస్థాన్ వరుస ఓటములు చవిచూసింది. కానీ సంజు శాంసన్ సారథ్య బాధ్యత లు స్వీకరించడంతో జట్టు ఆత్మవిశ్వాసం రెట్టింపు అయ్యింది. పంజాబ్‌తో జరిగిన మ్యాచ్‌లో సంజు శాంసన్ తన మార్క్ కెప్టెన్సీతో ఆకట్టుకున్నాడు. జట్టుకు అద్భుత విజయం సాధించి పెట్టాడు. ఈసారి కూడా జట్టు అతనిపై భారీ ఆశ లు పెట్టుకుంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో రాజస్థాన్ సమతూకంగా కనిపిస్తోంది. యశస్వి జైస్వాల్, శాంసన్, రియాన్ పరాగ్, హెట్‌మెయిర్, ధ్రువ్ జురెల్, జోఫ్రా ఆర్చర్, హసరంగ వంటి మ్యాచ్ విన్నర్లు జట్టులో ఉన్నారు. దీం తో ఈ మ్యాచ్‌లో రాజస్థాన్‌కు కూడా గెలుపు అవకాశాలు మెరుగ్గానే కనిపిస్తున్నాయి. మరోవైపు గుజరాత్ ఈ మ్యాచ్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ జట్టును ముందుండి నడిపిస్తున్నాడు. జోస్ బట్లర్, సాయి సుదర్శన్, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, ఇషాంత్ శర్మ, తెవాటియా, వాషింగ్టన్ సుందర్‌లతో గుజరాత్ బలోపేతంగా ఉంది. వరుస విజయాలు సాధిస్తుండడంతో జట్టు ఆత్మవిశ్వా సం రెట్టింపు అయ్యింది. ఈ మ్యాచ్‌లోనూ విజయం సాధించాలనే పట్టుదలతో బరిలో దిగుతోంది.

## తేలిపోయిన సన్‌రైజర్స్..

కిందటి ఐ పిఎల్ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ అ సాధారణ ఆటతో చెలరేగి పోయిన సంగతి తెలిసిం దే. బ్యాటింగ్, బౌలింగ్ విభాగంలో హైదరాబాద్ అద్భుత ప్రతిభను కనబరిచింది. బ్యాటింగ్‌లో అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, హెన్రిచ్ క్లాసెన్ తదితరులు ఆకాశ మే హద్దుగా చెలరేగి పోయారు. 2024లో సన్‌రైజర్స్ బ్యాటింగ్‌లో ఎన్నో రికార్డులను తిరిగరాసింది. కానీ ఈ సీజన్‌లో సీన్ పూ ర్తిగా మారిపోయింది. బ్యాటింగ్‌లో సన్‌రైజర్స్ పూర్తిగా తేలిపోతోంది. రాజస్థాన్‌తో జరిగిన మొదటి మ్యాచ్‌లో తప్పిస్తే హైదరాబాద్ బ్యాటర్లు ఏ మ్యాచ్‌లోనూ సత్తా చాటలేక పోయారు. తొలి మ్యాచ్‌లో సెంచరీతో అలరించిన ఇషాన్ కిషన్ ఆ తర్వాతి మ్యాచుల్లో పూర్తిగా నిరాశ పరిచాడు. వరుసగా మూడు మ్యాచుల్లో సింగిల్ డిజిట్‌కే పరిమితయ్యాడు. అభిషేక్ శర్మ కూడా చెత్త బ్యాటింగ్‌తో సతమతమవుతున్నాడు. హెడ్ కూడా ఫామ్ కోసం తంటాలు పడుతున్నాడు. హెన్రిచ్ క్లాసెస్ ఒక్కడే కాస్త మెరుగైన ఆటను కనబరుస్తున్నాడు. ఇక ఈ సీజన్‌లో ఇప్పటికే ఐదు మ్యాచ్‌లు ఆడిన హైదరాబాద్ కేవలం ఒకే ఒక మ్యాచ్‌లో విజయం సాధించింది. దీంతో సన్‌రైజర్స్ ప్లేఆఫ్ అవకాశాలు క్లిష్టంగా మారాయి. ఇకపై జరిగే మ్యాచుల్లోనైనా హైదరాబాద్ బ్యాటర్లు రాణిస్తారా లేదా వేచి చూడాల్సిందే.



# లక్నోదే గెలుపు

## ఛేదనలో పోరాడి ఓడిన కోల్‌కతా

ఈడెన్ గార్డెన్స్‌లో చివరి బంతి వరకు ఉత్కంఠ భరితంగా జరిగిన ఐపిఎల్ మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ విజయం సాధించింది. కోల్‌కతా నైట్‌రైడర్స్ 239పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో నిర్ణీత ఓవర్లు పూర్తయ్యే సరికి 234పరుగులు చేసి విజయానికి నాలుగు అడుగుల దూరంలో ఆగిపోయింది. కోల్‌కతా ఓపెనర్లు డికాక్ 15(9), సునీల్ నరైన్ 30 (13) ధాటిగా ఆరంభించినా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయారు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ రహానె 61 (35 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), వెంకటేశ్ అయ్యర్ 45 (29 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) అద్భుతంగా ఆడారు. ఫోర్లు, సిక్స్‌లు కొడుతూ, వికెట్ల మధ్య పరుగులు తీస్తూ మ్యాచ్‌ను నెమ్మదిగా కోల్‌కతా వైపు తిప్పారు. ఒకానొక దశలో కోల్‌కతా విజయావకాశాలు మెరుగ్గా కనిపించాయి. అయితే, శార్దూల్ ఠాకూర్ వేసిన 13 ఓవర్ మొత్తం మ్యాచ్ స్వరూపాన్ని మార్చేసింది. మొదటి ఐదు బంతులు ఐదు వైడ్‌లు వేసి చెత్త రికార్డును తన ఖాతాలో వేసుకున్న శార్దూల్ చివరి బంతికి రహానె వికెట్ తీయడంతో మ్యాచ్ మలుపు తిరిగింది. ఆ తర్వాత రమణదీప్ సింగ్(1), రఘువంశీ(5), రస్సెల్(7) తక్కువ పరుగులకే పెవిలియన్‌కు చేరారు. రింకూ సింగ్ 38 (15 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), హర్షిత్ రాణా 10 (9 బంతుల్లో 2 ఫోర్లు) చివరిలో మెరుపులు మెరిపించిన ఫలితం లేకుండా పోయింది. లక్నో బౌలర్లలో ఆకాశ్‌దీప్, శార్దూల్ ఠాకూర్ చెరో రెండు వికెట్లు తీయగా, అవేశ్‌ఖాన్, దిగ్వేష్ సింగ్, రవి బిష్ణోరు తలో వికెట్ తీశారు. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లక్నో నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 238 పరుగులు చేసింది. ఓపెనర్ మిచెల్ మార్ష్ (81బీ 48 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్స్‌లు) ఈ సీజన్‌లో నాలుగో అర్ధ శతకం నమోదు చేశాడు. ఇక నికోలస్ పూరన్ (87నాటౌట్‌బీ 36 బంతుల్లో 7 ఫోర్లు, 8 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. మార్‌క్రమ్ (47బీ 28 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడాడు. హర్షిత్ బౌలింగ్‌లో పూరన్ వరుసగా రెండు సిక్సర్లు కొట్టి 21 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. రస్సెల్ వేసిన 18 ఓవర్‌లో పూరన్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఈ ఓవర్‌లో అతను వరుసగా 4, 0, 4, 6, 4, 6 బాదేశాడు. చివరి రెండు ఓవర్లలో 21 పరుగులు వచ్చాయి. కోల్‌కతా బౌలర్లలో హర్షిత్ రాణాకు రెండు, ఆండ్రీ రస్సెల్ ఒక వికెట్ పడగొట్టారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ నికోలస్ పూరన్‌కు దక్కింది.



# ప్రియాన్ష్ సూపర్ సెంచరీ..
# చెన్నైపై పంజాబ్ గెలుపు



ఐపిఎల్ సీజన్-18లో తొలి శతకం నమోదైంది. పంజాబ్ కింగ్స్ యువ ఆటగాడు ప్రియాన్ష్ ఆర్య సూపర్ సెంచరీతో చెలరేగాడు. కేవలం 39బంతుల్లో 7ఫోర్లు, 9సిక్సర్ల సాయంతో సెంచరీ కొట్టాడు. చివర్లో శశాంక్(52నాటౌట్), జాన్సెన్(34నాటౌట్) కూడా రాణించడంతో పంజాబ్ జట్టు 219పరుగుల భారీ స్కోర్ చేసింది. అనంతరం చెన్నై జట్టు నిర్ణీత ఓవర్లు పూర్తయ్యేసరికి 5వికెట్లు కోల్పోయి 201పరుగులు చేసి ఓటమిపాలైంది. చెన్నై జట్టులో కాన్వే(69), దూబే(42), రచిన్ రవీంద్ర(36) బ్యాటింగ్‌లో రాణించారు. దీంతో చెన్నై జట్టు వరుసగా నాల్గో ఓటమిని చవిచూడగా.. పంజాబ్ 18పరుగుల తేడాతో చెన్నైపై గెలిచి నాల్గో స్థానానికి ఎగబాకింది. తొలి ఐపీఎల్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. అతడి ఇన్నింగ్స్‌లలోఉన్నాయి. ఐపీఎల్‌లో ఆర్యది 4వ ఫాస్టెస్ట్ సెంచరీతోపాటు అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేయకుండానే సెంచరీ కొట్టిన ఆటగాళ్ల జాబితాలోనూ చోటు దక్కించుకున్నాడు. ప్రియాన్ష్ ఔటయ్యాక పంజాబ్ కింగ్స్ వరుస క్రమంలో వికెట్లు కోల్పోయింది. నేహాల్ వధేరా(9), మాక్స్‌వెల్(0)ను అశ్విన్ పెవిలియన్‌కు పంపాడు. ఫామ్‌లో ఉన్న పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ రెండో వికెట్‌గా పెవీలియన్‌కు చేరాడు. 9 పరుగులు చేసిన శ్రేయస్ అయ్యర్.. ఖాలీల్ అహ్మద్ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డయ్యాడు. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ కింగ్స్ తొలి వికెట్ కోల్పోయింది. ముఖేష్ చౌదరి బౌలింగ్‌లో ప్రభుసిమ్రాన్ ఖాతా తెరవకుండానే పెవిలియన్‌కు చేరాడు. ముల్లాన్‌పూర్ వేదికగా పంజాబ్ కింగ్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్లు తలపడతున్నాయి. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన పంజాబ్ కింగ్స్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఇరు జట్లు కూడా ఎటువంటి మార్పులు లేకుండా బరిలోకి దిగాయి. దీంతో నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యేసరికి లక్నో జట్టు 6వికెట్ల నష్టానికి 219పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. చెన్నై బౌలర్లు ఖలీల్ అహ్మద్, అశ్విన్‌కు రెండేసి, నూర్ అహ్మద్, ముఖేశ్ చౌదరికి ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ప్రియాన్స్ ఆర్యాకు దక్కింది.

# ఐపీఎల్ హిస్టరీలో ఫాస్టెస్ట్ సెంచరీ ఇదే..

### టాప్ 5లో ప్రీతి జింటా ప్లేయర్





అత్యంత వేగవంతమైన సెంచరీల గురించి మాట్లాడితే, ఐపీఎల్ చరిత్రలో చాలానే ఫాస్టెస్ట్ సెంచరీలు నమోదయ్యాయి. ఇందులో అగ్రస్థానంలో నిలిచిన పేరు యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్ దే కావడం విశేషం. గేల్ కేవలం 30 బంతుల్లో ఫాస్టెస్ట్ సెంచరీ నమోదు చేశాడు. గేల్ తర్వాత ట్రావిస్ హెడ్, విల్ జాక్స్ వంటి ప్లేయర్లు కూడా ఈ లిస్ట్‌లో చోటు దక్కించుకున్నారు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ అంటే బ్యాటర్లు ఆధిపత్యం చెలాయించే టీ20 క్రికెట్ అనేది తెలిసిందే. ప్రతి సంవత్సరం అనేక రికార్డులు నమోదవుతుంటాయి. కొన్ని బద్దలవుతుంటాయి. ఈ క్రమంలో అత్యంత వేగవంతమైన సెంచరీల గురించి మాట్లాడితే, ఐపీఎల్ చరిత్రలో చాలానే ఫాస్టెస్ట్ సెంచరీలు నమోదయ్యాయి. ఇందులో అగ్రస్థానంలో నిలిచిన పేరు యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్ దే కావడం విశేషం. గేల్ కేవలం 30 బంతుల్లో ఫాస్టెస్ట్ సెంచరీ నమోదు చేశాడు. గేల్ తర్వాత ట్రావిస్ హెడ్, విల్ జాక్స్ వంటి ప్లేయర్లు కూడా ఈ లిస్ట్‌లో చోటు దక్కించుకున్నారు. 2013లో పూణే వారియర్స్ పై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరపున ఆడిన సమయంలో క్రిస్ గేల్ 30 బంతుల్లో సెంచరీ చేసిన సెంచరీ ఇప్పటికీ ఐపీఎల్ చరిత్రలో అత్యంత వేగవంతమైన సెంచరీగా నిలిచింది. ఈ ఇన్నింగ్స్ అత్యంత వేగవంతమైనది మాత్రమే కాదు, టీ20 క్రికెట్ చరిత్రలో అత్యంత చిరస్మరణీయమైన ఇన్నింగ్స్‌లలో ఒకటిగా నిలిచింది. ఆ మ్యాచ్‌లో గేల్ 175 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఇది కూడా ఓ రికార్డు. గేల్ తర్వాత, యూసుఫ్ పఠాన్ పేరు నిలిచింది. పఠాన్ 2010లో రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతున్నప్పుడు ముంబై ఇండియన్స్‌పై 37 బంతుల్లో సెంచరీ చేశాడు. పఠాన్ చేసిన ఈ సెంచరీ భారత బ్యాట్స్‌మన్ చేసిన వేగవంతమైన సెంచరీలో మొదటి కావడం విశేషం. తాజాగా పంజాబ్ కింగ్స్ ప్లేయర్ ప్రియాంష్ ఆర్య చెన్నై సూపర్ కింగ్స్‌పై కేవలం 39 బంతుల్లో తన సెంచరీని పూర్తి చేశాడు. ఐపీఎల్‌లో అత్యంత వేగవంతమైన సెంచరీ చేసిన రెండవ భారతీయుడిగా ప్రియాంష్ రికార్డులకెక్కాడు.


జై భీమ్ POWER OF PEOPLE Jai Bheem TV

# త్రివిక్రమ్ ట్రీట్ ఎక్కడ?



ఈ రోజు అల్లు అర్జున్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా అట్లీ దర్శకత్వంలో అతను చేయబోయే మెగా మూవీకి సంబంధించిన ఆసక్తికర అప్‌డేట్‌తో వీడియో వచ్చింది. ఈ వీడియోతో సినిమా మీద అంచనాలు అమాంతం పెరిగిపోయాయి. ఐతే 'పుష్ప-2' తర్వాత బన్నీ చేయాలనుకున్న సినిమా ఇది కాదు. దీని కంటే ముందు త్రివిక్రమ్ ప్రాజెక్టును ఓకే చేశాడు. దాన్నే ముందు మొదలుపెట్టాలనుకున్నాడు. కానీ అనూహ్యంగా అట్లీ ప్రాజెక్టు తెరపైకి వచ్చింది. ఆ సినిమాకు సంబంధించి అన్నీ వేగంగా ముందుకు కదిలాయి. అతి త్వరలోనే ఈ చిత్రం సెట్స్ మీదికి కూడా వెళ్లబోతోంది. అట్లీతో బన్నీ సినిమా అన్నపుడు పెద్దగా ఎగ్జైట్ కాని వాళ్లలో కూడా ఈ రోజు రిలీజ్ చేసిన ప్రోమో వీడియో క్యూరియాసిటీ పెంచింది. ఈ ప్రాజెక్టుకు కావాల్సినంత హైప్ వచ్చేసింది. ఐతే ఎప్పట్నుంచో అభిమానులు ఎంతో ఊహించుకుంటున్న త్రివిక్రమ్ ప్రాజెక్టు సంగతి ఇప్పుడు డోలాయమానంలో పడిపోవడమే ఆశ్చర్యం కలిగించే విషయం. బన్నీ.. అట్లీ మూవీతో పాటు త్రివిక్రమ్ సినిమా కూడా చేస్తాడనే కొంత కాలంగా వార్తలు వస్తూ ఉన్నాయి. ఐతే ఇప్పటిదాకా ఆ సినిమాను అధికారికంగా అనౌన్స్ చేసింది లేదు. బన్నీ వాసు, నాగవంశీ లాంటి వాళ్లు వేర్వేరు సందర్భాల్లో సినిమాకు బాగానే హైప్ ఇచ్చారు కానీ.. అఫీషియల్ అనౌన్స్‌మెంట్ మాత్రం ఎంతకీ రావట్లేదు. అట్లీ సినిమా నుంచి రిలీజ్ చేసినట్లు వీడియో ప్రోమో లేకపోయినా.. కనీసం బన్నీ పుట్టిన రోజుకు ఒక మంచి అప్డేట్ అయినా రిలీజ్ చేస్తే బాగుండేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కానీ ఇప్పటికే నిర్మాత నాగవంశి సినిమా మొదలవ్వడానికి కొంచం సమయం పడుతుంది అని పలు సందర్భాల్లో చెప్పడం అందరికీ తెలిసిన విషయమే. అందుకే ఒక సాధారణ పోస్టర్ తో సరిపెట్టారు. ఇక ఫ్యాన్స్ ఎలాంటి అప్డేట్స్ ఆశించకుండా అట్లీ బన్నీ అనౌన్స్మెంట్ వీడియో తో సరిపెట్టుకోవాలని కామెంట్లు మొదలయ్యాయి.

# అదరగొట్టిన 'లెనిన్' గ్లింప్స్



ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థలు అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్‌మెం ట్స్ యంగ్ అండ్ డైనమిక్ హీరో అఖిల్ అక్కినేనితో భారీ సినిమాను నిర్మిస్తున్నాయి. 'అఖిల్ 6'ని అక్కినేని నాగార్జున, నాగవంశీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. అక్కినేని అఖిల్ పుట్టినరోజును పురస్కరించుకుని అఖిల్ 6వ చిత్రానికి లెనిన్ అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ప్రకటించారు. మురళీ కిశోర్ అబ్బూరు ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. వినరో భాగ్యము విష్ణు కథ చిత్రంతో దర్శకుడిగా పేరు తెచ్చుకున్నారు మురళీకిశోర్ అబ్బూరు. ఇంటెన్స్, యాక్షన్ ప్యాక్డ్ ఎక్స్‌పీరియన్స్ తో రాయలసీమ నేపథ్యంలో రోమాలు నిక్కబొడుచుకునేలా సాగింది లెనిన్ గ్లింప్స్. టైటిల్ గ్లింప్స్ పవర్‌ఫుల్ విజువల్స్‌తో ప్రారంభమైంది. ఆధ్యాత్మిక అంశాలను చొప్పిస్తూ ఆద్యంతం ఆకట్టుకునే ప్రయత్నం చేశారు మేకర్స్. అఖిల్ అక్కినేని%ౖ% స్టన్నింగ్ లెనిన్ పాత్రకు అద్భుతంగా సరిపోయారు. ఆయన దట్టమైన మీసం, పొడవాటి జుట్టు మ్యాచో అవతార్‌కు పక్కాగా సూట్ అయ్యాయి. అఖిల్ సరసన శ్రీలీల నటిస్తున్న విషయం గ్లింప్స్‌లో తెలియజేశారు. టైటిల్ గ్లింప్స్‌లో మాసివ్ యాక్షన్ మొమెంట్స్, పంచ్ మాత్రమే కాదు పవర్‌ఫుల్ డైలాగ్ కూడా ఆడియన్స్‌ని కట్టిపడేసింది. 'పుట్టేటప్పుడు ఊపిరి ఉంటుంది రా, పేరు ఉండదు. పోయేటప్పుడు ఊపిరి ఉండదు, పేరు మాత్రమే ఉంటుంది' అని రాయలసీమ యాసలో అఖిల్ చెప్పిన డైలాగ్ సింపుల్‌గా అదుర్స్ అంతే. ఒళ్లు గగుర్పొడిచేలా సాగింది లెనిన్ టైటిల్ గ్లింప్స్.

# నాగ సాధువుగా తమన్నా అద్భుతమైన నటన

తమన్నా భాటియా హైలీ యాంటిసిపేటెడ్ మూవీ 'ఓదెల 2'లో నెవర్ బిఫోర్ క్యారెక్టర్ లో అలరించడానికి సిద్ధంగా వున్నారు. సూపర్ నేచురల్ థ్రిల్లర్ 'ఓదెల రైల్వే స్టేషన్'కి సీక్వెల్ ఇది. సంపత్ నంది కథ, స్క్రీన్‌ప్లే, డైలా గ్ రైటర్ గా మల్టిపుల్ రోల్స్‌లో వర్క్ చేశారు. అలాగే డైరెక్షన్ సూపర్ విజన్‌ని అందిస్తున్నారు. అశోక్ తేజ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్‌వర్క్ బ్యానర్స్ పై డి.మధు నిర్మిస్తున్నారు. ముంబైలో జరిగిన గ్రాండ్ ఈవెంట్‌లో మేకర్స్ థియేట్రికల్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. నాగ సా ధువుగా తమన్నా భాటియా అద్భుతమైన నటనతో ఆకట్టుకుంది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో హీరోయి న్ తమన్నా మాట్లాడుతూ " సంపత్ నంది ఈ సినిమాలో నా పాత్రని రాసిన విధానం చాలా అద్భుతం గా ఉంటుంది. వశిష్ట సింహ తన అద్భుతమైన నటనతో సినిమాను మరో స్థాయికి తీసుకువెళ్లాడు. ఈ సినిమాలో నేను చేసిన శివశక్తి పాత్రకు ఎలాంటి రిఫరెన్స్ లేదు. ఈ సినిమా అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది"అని అన్నారు. మూవీ క్రియేటర్ సంపత్ నంది మాట్లాడుతూ "రచ్చ సినిమా నుంచి తమన్నాతో జర్నీ ఉంది. తను అద్భుతమైన నటి. ఈ సినిమాలో శివశక్తి పాత్రని మరో స్థాయిలో చే శారు. సినిమా కోసం చాలా కష్టపడ్డారు"అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మాత డి.మధు, వశిష్ట సింహ, ఆదిత్య భాటియా పాల్గొన్నారు.






# అభిమానుల ఫ్రస్ట్రేషన్ న్యాయమే కానీ

ది రాజా సాబ్ విషయంలో జరుగుతున్న ఆలస్యం, అప్డేట్స్ లేకుండా కనిపిస్తున్న నిర్లిప్తత ఫ్యాన్స్ ని ఫ్రస్ట్రేట్ చేస్తున్న మాట వాస్తవం. దర్శకుడు మారుతీ తన ఎక్స్ లో పెడుతున్న ట్వీట్స్ కు కామెంట్స్ పెట్టకుండా ఆప్షన్ ఎంచుకోవడం చూస్తే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. నిన్న తత్వం అనే చిన్న సినిమాకు విష్ చేసిన మారుతీ దాని కింద ఎవరూ రెస్పాండ్ కాకుండా చూసుకున్నారు. ఇవాళ పుణ్యక్షేత్రాల సందర్శన సందర్భంగా పెట్టిన ఫోటోలకు ఎలాంటి రిస్ట్రిక్షన్ లేకపోవడంతో యథావిధిగా ఫ్యాన్స్ కామెంట్స్ తో దాడి చేశారు. నిజానికి ఇక్కడ మారుతీ వైపే అన్ని వేళ్ళు లేవు. రకరకాల కారణాలతో రాజా సాబ్ కు బ్రేక్ పడింది.కొంచెం టైం పట్టేలా ఉండటంతో ప్రభాస్ ఫౌజీ వైపు ఎక్కువ దృష్టి పెట్టాడు. అయితే డార్లింగ్ ఫ్యాన్స్ వెర్షన్ వేరేలా ఉంది. రాజా సాబ్ ని ఏప్రిల్ నుంచి వాయిదా వేసుకున్నాక కనీసం ఇంకో రెండు మూడు నెలల్లో రిలీజ్ చేసేలా ప్లాన్ చేసుకోవాలి కానీ ఇలా కాలం వృథా చేస్తూ పోతే ఉన్న బజ్ కూడా తగ్గిపోతుందని ఆందోళన చెందుతున్నారు. అసలు ఈ ఏడాది వస్తుందా రాదానే అనుమానాలు వాళ్లలో బలంగా ఉన్నాయి. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ వైపు నుంచి ఫ్రెష్ గా వాయిదా గురించైనా సరే ఒక అఫీషియల్ అప్డేట్ వస్తే అభిమానుల అసంతృప్తిని కొంత తగ్గించవచ్చు. అసలే ప్రభాస్ లైనప్ చాలా పెద్దది ఉంది. రాజా సాబ్, ఫౌజీ, స్పిరిట్, సలార్ పార్ట్ 2 శౌర్యంగపర్వం, కల్కి 2 ఇలా దర్శకులందరూ క్యూ కట్టి ఉన్నారు. అన్నీ లెక్కేసుకుంటే పేపర్ మీద బడ్జెట్ రెండు వేల కోట్లు దాటిపోతుంది. టయర్ 1 స్టార్ హీరోల్లో వేగంగా ప్యాన్ ఇండియా మూవీస్ చేస్తున్న ప్రభాస్ రిలీజ్ ప్లానింగ్ పరంగా అంతే స్పీడ్ గా లేకపోవడం పట్ల ఫ్యాన్స్ ఆందోళన చెందడం న్యాయమే. ప్రాజెక్టు మొదలుపెట్టినప్పుటి ట్యూన్స్ ఇప్పుడు అవుట్ డేట్ అయ్యాయని, కొత్త పాటలు కంపోజ్ చేస్తున్నానని ఇటీవలే తమన్ చెప్పడం మరో కొసమెరుపు. చెట్టెక్కిన భేతాళుడిలా రాజా సాబ్ ఆగమనం త్వరలో అయితే జరిగేలా లేదు.

# తారక్‌తో సుకుమార్ సినిమా

పుష్ప 2తో పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్ కొట్టిన దర్శకుడు సుకుమార్ కొత్త ప్రాజెక్టు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. 'పెద్ది' సినిమా షూటింగ్ పూర్తయిన తర్వాత రామ్‌చరణ్‌తో సినిమా చేయాల్సివుంది. దీనికోసం ఇప్పటికే స్క్రిప్ట్ వర్క్ కొనసాగిస్తున్నారు. మరోవైపు జూనియర్ ఎన్టీఆర్ (తారక్) 'వార్ 2'లో నటిస్తున్నారు. త్వరలో ప్రశాంత్‌నీల్ ప్రాజెక్టులో చేరుతారు. ఇలాంటి పరిస్థితుల్లో తారక్‌తో సుకుమార్ భేటీపై ఇండిస్ట్రీలో చర్చలు కొనసాగుతున్నాయి. సుకుమార్ సతీమణి తబిత ఇన్‌స్టాలో వీరిద్దరూ కలిసి ఉన్న ఫొటోను షేర్‌చేశారు. 'తారక్‌కి ప్రేమతో' అని సుకుమార్ భుజంపై తారక్ వాలి ఉన్న ఫొటోని పోస్ట్‌చేశారు. దీన్ని తారక్ రీపోస్ట్ చేయగా%ౖ% మళ్లీ దీన్ని సుకుమార్ రీ పోస్టు చేసి 'మై అభిరామ్' అని రాసుకొచ్చారు. గతంలో సుకుమార్..ఎన్టీఆర్‌తో 'నాన్నకు ప్రేమతో' సినిమా తీయగా అది బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచింది. తాజాగా వీరిద్దరు భేటీపై కొత్త ప్రాజెక్టుకు రంగం షురూ అంటూ ఇండిస్ట్రీలో చర్చలు కొనసాగుతున్నాయి.



# భయాన్నే భయపెడతాడు

అజిత్ కుమార్ హీరోగా మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన మల్టీ లాంగ్వేజ్ ప్రాజెక్ట్ 'గుడ్ బ్యాడ్ అగ్లీ' ఈనెల 10న ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధంగా ఉంది. టి-సిరీస్ గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహించిన ఈ హై-ప్రొఫైల్ మూవీ ఇప్పటికే ప్రమోషనల్ కంటెంట్‌తో సంచలనం సృష్టించింది. తాజాగా మేకర్స్ తెలుగు ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. హీరో అజిత్‌ను డిఫరెంట్ అవతార్స్‌లో నెవర్ బిఫోర్ క్యారెక్టర్‌లో ప్రజెంట్ చేసిన ట్రైలర్ అదిరిపోయింది. తన కొడుకును కాపాడుకోవడానికి తన వైలెంట్ పాస్ట్‌కి తిరిగి వచ్చే పాత్రలో అజిత్ క్యారెక్టరైజేషన్ చాలా క్యురియాసిటీని పెంచింది. భయాన్నే భయపెడతాడనే డైలాగ్ హీరో క్యారెక్టర్ ఎంత పవర్ ఫుల్‌గా ఉండబోతోంది సూచిస్తోంది. ట్రైలర్‌లో త్రిష కృష్ణన్, అర్జున్ దాస్, ప్రభు, ప్రసన్న, సునీల్ కీలక పాత్రల్లో కనిపించారు. అభినందన్ రామానుజం సినిమాటోగ్రఫీ అద్భుతంగా ఉంది, జీవీ ప్రకాష్ కుమార్ నేపథ్య సంగీతం ఎక్స్‌ట్రార్డినరీగా ఉంది. మైత్రీ మూవీ మేకర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ ప్రొడక్షన్ వాల్యూస్ చాలా గ్రాండియర్‌గా ఉన్నాయి.

